ప్రజాశక్తి

శనివారం 23 సెప్టెంబర్ 2023 5 కర్నూలు

దళిత రక్షణ యాత్రను ప్రారంభిస్తున్నగౌస్‌దేశాయి, రాధాకృష్ణ

పనులు కాకుండానే ప్రారంభం

- అర్ధాంతరంగా చెరువులకు నీళ్లు నింపే కార్యక్రమం - పూర్తికాని ప్రాజెక్టుకు సిఎం శ్రీకారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పనులు పూర్తి కాకుండానే ఓ ప్రాజెక్టును ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. హంద్రీనీవా ద్వారా 77 చెరువులకు నీళ్లు నింపే కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించగా పనులు మాత్రం పూర్తి కాలేదు...

హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 77 చెరువులకు నీటిని విడుదల మంగళవారం సీఎం జగన్మోహన్ రెడ్డి లాంఛనంగా విడుదల చేశారు. కృష్ణగిరి మండలం ఆలంకొండ వద్ద రూ.253.72 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన సిఎం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాల పశ్చిమ ప్రాంత 77 చెరువులకు హంద్రీనీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ నుండి 10363 ఎకరాల ఆయకట్టుకు సాగు కానుంది. అధికారిక లెక్కల ప్రకారం డోన్ నియోజకవర్గానికి సంబంధించి డోన్ మండలంలో 28 చెరువులకు గాను 2464.50 ఎకరాల ఆయకట్టు, ప్యాపిలి మండలంలో 18 చెరువులకు 1796.80 ఎకరాల ఆయకట్టు, పత్తికొండ నియోజకవర్గానికి సంబంధించి కృష్ణగిరి మండలంలో 4 చెరువులకు 1472.07 ఎకరాల ఆయకట్టు, వెల్దుర్తి మండలంలో 13 చెరువులకు 2001.8 ఎకరాల ఆయకట్టు, పత్తికొండ మండలంలో 3 చెరువులకు 212.60 ఎకరాల ఆయకట్టు, తుగ్గలి మండలంలో 13 చెరువులకు 1386.62 ఎకరాల ఆయకట్టు, మద్దికెర మండలంలో 2 చెరువులకు 699.50 ఎకరాల ఆయకట్టు సాగు కానుంది. అలాగే ఆలూరు శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి దేవనకొండ మండలంలో 3 చెరువులకు 171.5 ఎకరాల ఆయకట్టు, పాణ్యం శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి, కల్లూరు మండలం లో 2 చెరువులకు 157.60 ఎకరాల ఆయకట్టు సాగు మొత్తం 10363 ఎకరాల ఆయకట్టు సాగు కానుంది. స్వయంగా ముఖ్యమంత్రే ఈ ప్రాజెక్టును ప్రారంభించిన పనులు మాత్రం పూర్తి కాలేదు. హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి ఆలంకొండ వద్ద పంపుహౌస్ ఏర్పాటు చేసి 5.60 కిలోమీటర్ల దూరంలో కటారుకొండ వద్ద డెలివరీ ఛాంబర్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి మూడు పైప్‌లైన్ల ద్వారా చెరువులకు నీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. అయితే ఎంపిక చేసిన ప్రాజెక్టుల ఒక్క చెరువును బాగు చేయలేదు. పూడికతీత, కట్టల బలోపేతం, కరకట్ట రాతిపరుపు, గేట్లు, అలుగుల వద్ద లైనింగ్ వంటి పనులు

చెరువులకు నీళ్లు నింపే కార్యక్రమం ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి (ఫైల్)

చేయాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. కటారుకొండ నుంచి చెరువులకు నీటిని తరలించేందుకు 110 కిలోమీటర్ల పొడవున పైప్‌లైన్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే వీటిలో సగం కూడా పనులు పూర్తి కాలేదు. ప్యాపిలి మండలంలో 18 చెరువులకు నీరందించాల్సి ఉండగా నాలుగు చోట్ల మాత్రమే అరకొర పనులు చేశారు. పైప్‌లైన్ పనులు సాగుతున్నాయి. డోన్ మండలంలో 28 చెరువులకు నీరందించాల్సి ఉండగా 27 చోట్ల పనులు పూర్తయ్యాయి. తుగ్గలి మండలంలో 13 చెరువులకు నీరు అందించాల్సి ఉండగా ఏడు చోట్ల మాత్రమే పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. పత్తికొండ మండలంలో చక్రాళ్ల, చందోలి, పత్తికొండ చెరువులకు నీరందించాల్సి ఉంది. చక్రాళ్ల, చందోలి చెరువులకు పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. పత్తికొండలో పైప్‌లైన్ పనులు పూర్తి కాలేదు. పనులు పూర్తి కాకుండానే ప్రారంభం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి

నాలుగేళ్ల తరువాత కూడా అసంపూర్తిగానే చెరువులకు నీటిని నింపే పనులు ఉండగా రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేవలం రాజకీయ లబ్ధి కోసం ప్రారంభం తతంగాన్ని నిర్వహించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ కాలం పూర్తయ్యేలోపే పనులు పూర్తి చేయాలి. అప్పుడే ప్రజలు నమ్ముతారు. లేకుంటే టిడిపికి పట్టిన గతే వైసిపికి పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం, ముఖ్యమంత్రి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- కె.ప్రభాకర్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

అంటరానితనం నిర్మూలన అంబేద్కర్ కల

- రాజ్యాంగంలో పొందుపరిచినా ఎందుకు నిర్మూలించరు..? - దళిత రక్షణ యాత్ర ప్రారంభ సభలో వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అంటరానితనం నిర్మూలన అంబేద్కర్ కల అని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని పాతబస్టాండ్ అంబేద్కర్ విగ్రహం ముందు కెవిపిఎస్, వ్యకాస జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దళిత రక్షణ యాత్ర జీపు జాతాను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వి.ఎస్.రాధాకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.పెద్దబాబు అధ్యక్షత వహించారు. ప్రారంభ సభనుద్దేశించి గౌస్‌దేశాయి, రాధాకృష్ణ, వ్యకాస, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు కెవి.నారాయణ, ఎమ్‌డి.ఆనంద్‌బాబు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ బి.రామాంజనేయులు, న్యాయవాది రవికుమార్, ఆర్‌విఎస్ జిల్లా కార్యదర్శి గురు శేఖర్, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడారు. కులాన్ని కూకటి వేళ్లతో పెకిలి వేయాలని, అంటరానితనాన్ని అంతమొందించాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కలలు కన్నారని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసమే ఈ దళిత రక్షణ యాత్ర అని చెప్పారు. సమాజం అంతటికీ అవసరమైన పనులు చేస్తూ, ఊరి అవతలి బతుకులుగా జీవిస్తున్న దళితుల సమస్యలు పరిష్కరించాలని దళిత రక్షణయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. చట్టాలు ఎన్ని వచ్చినా ఉన్నోళ్ల చట్టాలుగానే మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అట్రాసిటీ చట్టం అండగా ఉన్నా, 41 సిఆర్‌పిసి పేరుతో నీరుగారుస్తున్నారన్నారు. దళిత వృత్తులు రోజురోజుకూ అడుగంటుతూ బతుకు కోసం పోరాడుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. వీటికి తోడు దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని, దగాకు గురవుతున్న దళితులకు సంక్షేమ పథకాలను సైతం సంపూర్ణంగా రద్దు చేశారని చెప్పారు. ఆర్థిక ప్రగతి, ఆత్మగౌరవం కోసం రెండెకరాల భూమి ఇవ్వాలని, ప్రయివేట్ రంగాలలోనూ, పదోన్నతులలోను రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వాడవాడలా దళితులను చైతన్యం చేస్తూ ఈనెల 29న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. న్యాయవాది ఆనందరావు, కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు విజయమ్మ, కరుణాకర్, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు వెంకట రాముడు, సహాయ కార్యదర్శి నాగన్న, కర్నూలు మండల కార్యదర్శి గోపాల్, ఆర్‌టిఐ యాక్టివిస్ట్ లక్ష్మీనారాయణ, కెవిపిఎస్ న్యూ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏసు రాజు, భాస్కర్, ఓల్డ్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు రమణ, గురుస్వామి, జిల్లా నాయకులు చక్రపాణి, గోపాల్, రోశయ్య, నరసింహులు పాల్గొన్నారు.

లక్ష్య ఛేదనలో నిర్లక్ష్యమెందుకు..?

- మంత్రాలయం తహశీల్దార్, సర్వేయర్‌పై చర్యలు - కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మంత్రాలయం మండలానికి గ్రౌండ్ ట్రూతింగ్ 700 ఎకరాలు చేయాలని లక్ష్యం కేటాయించగా కేవలం 20 ఎకరాలు చేయడం ఏమిటని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అసహనం వ్యక్తం చేశారు. తహశీల్దార్, సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఒలతో రీసర్వే, హౌసింగ్, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న భూ హక్కు పత్రాల పంపిణీని సోమవారం నాటికి పూర్తి చేయాలని తెలిపారు. ఓర్వకల్లు, కర్నూలు రూరల్, గూడూరు, పెద్దకడబూరు, కోడుమూరు, సి.బెళగల్ మండలాల్లోని గ్రామాల్లో ఎక్కువగా పెండింగ్ ఉన్నాయని చెప్పారు. వాటిని సోమవారం నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రేపు హౌసింగ్ డే ఉందని, బిలో బేస్‌మెంట్ లెవెల్ స్థాయి నుంచి బేస్‌మెంట్ లెవెల్ స్థాయికి, బేస్‌మెంట్ లెవెల్ స్థాయి నుంచి కంప్లీషన్ స్థాయికి సంబంధించిన పనుల్లో ఆప్షన్ 3 కింద నిర్మిస్తున్న కాంట్రాక్టర్లతో ఎంపిడిఒ, హౌసింగ్ ఎఇలు సమావేశం నిర్వహించుకోవాలని సూచించారు. బేస్‌మెంట్ లెవెల్ స్థాయి నుంచి కంప్లీషన్ స్థాయికి కన్వర్షన్ చేసే పనుల పూర్తి బాధ్యత హౌసింగ్ ఎఇలపై ఉందని చెప్పినా 'జీరో' పురోగతి సాధించడం ఏమిటని హొళగుంద, కర్నూలు, కోడుమూరు, ఆదోని అర్బన్ మండలాల హౌసింగ్ ఎఇలను ప్రశ్నించారు. పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పూర్తి కావాల్సిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కౌతాళం మండలం ఇంకా 96 శాతం ఎందుకు ఉందని, సోమవారం నాటికి వంద శాతం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. సచివాలయాలు, ఆర్‌బికెలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు అక్టోబర్ 15 నాటికి పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ అధికారులకు సూచించారు. సిమెంట్, ఇసుక కొరత, లేబర్ సమస్య ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల స్థాయిలో బుధవారం, శనివారం నిర్వహించే కో ఆర్డినేషన్ సమావేశాలకు సంబంధించిన మినిట్స్ రేపు సాయంత్రం నాటికి ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్‌కు పంపించాలని ఆదేశించారు. జెసి నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ... స్టోన్ ప్లాంటేషన్ 10 గ్రామాల్లో పూర్తయిందని, పెండింగ్ ఉన్న గ్రామాల్లో రేపు సాయంత్రం నాటికి పూర్తి చేయాలని తెలిపారు. ఓర్వకల్లు మండలం శకునాల గ్రామంలో, కోడుమూరు మండలం, వెల్దుర్తి మండలంలోని బుక్కాపురం గ్రామంలో ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని, తహశీల్దార్లు ప్రణాళిక రూపొందించుకొని శనివారం సాయంత్రం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ సృజన

కోడుమూరులో 'జగనన్న చెబుదాం'

కోడుమూరు మండల పరిషత్ సమావేశ భవనంలో 'జగనన్నకు చెబుదాం' నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ సృజన, జెసి నారపురెడ్డి మౌర్య హాజరయ్యారు. బాధితుల నుంచి 70 వినతులను స్వీకరించారు. గోరంట్ల గ్రామానికి చెందిన రైతు బోగేశ్వరరెడ్డి తన పొలం సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సర్వే నెంబర్ 22 'ఎ'లో ఉన్న 1.50 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో తన పేరు తొలగించి మరో వ్యక్తిపై నమోదు చేశారని ఫిర్యాదు చేశారు. కోడుమూరుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలని, సుందరయ్య నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, మార్కెట్ యార్డును అభివృద్ధి చేయాలని, హంద్రీ నది బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని సిపిఎం డివిజన్ కార్యదర్శి గఫూర్‌మియా కోరారు. ఇంద్రజిత్ గుప్త నగర్‌లో పేదల ఇళ్లకు పట్టాలివ్వాలని సిపిఐ నాయకులు కోరారు.

ప్రభుత్వ విద్యా పరిరక్షణ యుటిఎఫ్ ధ్యేయం

- రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు
- గోల్డెన్ జూబ్లీ లోగో, జెండాల ఆవిష్కరణ
- జిల్లాలో కొనసాగిన యుటిఎఫ్ ప్రచార జాత

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్/ పత్తికొండ/ కోడుమూరు

అక్టోబర్ 1న విజయవాడలో జరిగే యుటిఎఫ్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం కర్నూలులో ఉత్సవాల లోగోను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి లు ఆవిష్కరించారు. యుటిఎఫ్ ప్రచార జీపు జాత అనంతపురం జిల్లా నుండి కర్నూలు జిల్లాలోకి ప్రవేశించి పత్తికొండ, కోడుమూరు, కర్నూలు పట్టణాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. కర్నూలు నగరం సి.క్యాంపులో యుటిఎఫ్ స్వర్ణోత్సవాల లోగోను ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా పూర్వ అధ్యక్షులు జి.పుల్లయ్య జెండాను ఎగురవేశారు. జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలే పరిష్కారధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఉపాధ్యాయుల హక్కులు సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు సాగించిందన్నారు. రాష్ట్రంలో ఈ సంఘం ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థ పరిరక్షణకు కృషి చేస్తుందన్నారు. సిపిఎస్ ను రద్దుచేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానాన్ని కూడా రాష్ట్రంలో అమలు చేయకుండా నిలువరించాలని పేర్కొన్నారు. అక్టోబర్ 1న విజయవాడలో జరిగే గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలలో పెద్ద ఎత్తున యుటిఎఫ్ నాయకులు కార్యకర్తలు హాజరుకావాలన్నారు. రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి నాగమణి, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.జయరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకున్న నూతన విద్యా విధానాన్ని అమలు చేయడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అనంతరం యుటిఎఫ్ ప్రచార జాత కర్నూలు మీదుగా నంద్యాల జిల్లాలోకి ప్రవేశించింది. యుటిఎఫ్ మాజీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నరసింహులు, జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, జిల్లా నాయకులు నవీన్‌పాటి యెహోషువ, గోపాల్ ,నరసింహ, దావీదు, ఇబ్రహీం, ప్రసాదు, మద్దిలేటి, లక్ష్మీదేవి పాల్గొన్నారు. **పత్తికొండ** పట్టణంలోని గోపాల ప్లాజాలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి భాస్కర్ అధ్యక్షతన యుటిఎఫ్ 50వ ఆవిర్భావ స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ జెండాను రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ ఆవిష్కరించారు. పట్టణంలోని యుటిఎఫ్ నాయకులు ఆర్టీసీ బస్టాండ్ నుండి నాలుగు స్తంభాల కూడలి మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు ప్రచార జాత యాత్రను నిర్వహించారు. వస్వర్ణోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ యెహోషువ, జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప, ప్రధాన కార్యదర్శి జయరాజు, సహాధ్యక్షులు రవికుమార్, యుటిఎఫ్ మండల నాయకులు ప్రసాద్, సత్యనారాయణ, ఈశ్వర్, రవి ప్రకాష్ రెడ్డి, రంగస్వామి వీరేష్, అలీబాష పాల్గొన్నారు. **కోడుమూరు** ప్రభుత్వ వైద్యశాల నుంచి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నవీన్ పాటి యాదవ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్‌లో పతాకావిష్కరణ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నాయకులు మాట్లాడారు. జిల్లా నాయకులు నీలకంఠ. రవికుమార్. యోహోషువా, ,నాగరాజు , కాశీం, దావీదు, వెంకటేష్, నరసింహ, దేవపాల్, సుధాకర్, రాజు ,సుంకన్న పాల్గొన్నారు.

కోడుమూరులో మాట్లాడుతున్న నాయకులు నవీన్‌పాటి , వేదికపై రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

పత్తికొండలో మాట్లాడుతున్న నాయకులు

నేడు ట్రిపుల్ ఐటి డిఎం ఐదవ స్నాతకోత్సవం

113 మందికి డిగ్రీ పట్టాలు ప్రదానం -ఐదుగురికి గోల్డ్ మెడల్

ముఖ్యఅతిథిగా డాక్టర్ బివిఆర్ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ట్రిపుల్ ఐటిడిఎం విద్యాసంస్థ 5వ స్నాతకోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం అయింది. గత నాలుగు సంవత్సరాల కంటే ఈ ఏడాది విద్యా సంస్థ జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. ఈ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు ఉన్నత పరిశోధనలకు ఎంపికై చరిత్ర సృష్టించారు. శనివారం కర్నూలు నగర శివారులోని జగన్నాథ గట్టు సమీపంలో ఉన్న ట్రిబుల్‌ఐటి డిఎం విద్యాసంస్థ స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన 113 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేయనున్నారు. ఆయా విభాగాల్లో ఐదుగురు గోల్డ్ మెడల్స్‌కు ఎంపికయ్యారు. ఓవరాల్ టాపర్‌గా సిఎస్ఇ కి చెందిన మాణిక్యాంబ విద్యార్థిని గోల్డ్ మెడల్‌ను అందుకోనున్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా సెయింట్ సంస్థ చైర్మన్ , వ్యవస్థాపకుడు డాక్టర్ బివి ఆర్. మోహన్ రెడ్డి హాజరు కానున్నారు. ఆయన అనేక జాతీయ విద్యా సంస్థల్లో పని చేశారు. ఈ ఏడాది దాదాపుగా 30 పరిశోధనలు నిర్వహించేందుకు రూ.ఆరు కోట్ల నిధులు కూడా మంజూరు కావడం విశేషం. డైరెక్టర్ సోమయాజులు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల కంటే ఈసారి తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని అన్నారు. జాతీయస్థాయిలో తమ విద్యా సంస్థకు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నీతి అయోగ్‌లో ఎంపికయిన మద్దికేర

ప్రజాశక్తి-మద్దికేర

నీతి అయోగ్‌లో భాగంగా ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద మద్దికేర మండలం ఎంపికయిందని ఎంపిడిఒ నరసింహా మూర్తి తెలిపారు. మద్దికేర కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్, ఐకెపి, మండల, పరిషత్ ఆర్డబ్ల్యుఎస్, ఐసిడిఎస్, అగ్రికల్చర్, సోషల్‌వెల్ఫేర్, ఎడ్యుకేషన్, పరిసరాలు పరిశుభ్రత అంగన్వాడి తదితర పది రకాల సంబంధిత శాఖల అధికారులు సమావేశమయ్యారు. అన్ని గ్రామపంచాయతీల సర్పంచుల సహకారంతో ఈ పథకం అమలు అయ్యేలా చూడాలని అధికారులకు తెలిపారు. అన్ని గ్రామాల్లో రైతులకు డ్రిప్ ఇరిగేషన్ వ్యవసాయ పరికరాలు పరిసరాల పరిశుభ్రత సైడ్ కాలువలు బాల కార్మికులు ఊరు బయట లేకుండా పొదుపు సంఘాల కొరకు నిరుద్యోగుల ఉపాధి కొరకు పలు రకాలైన మౌలిక వసతులను కేంద్ర ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకానికి పది రకాల శాఖలకు సంబంధించిన అధికారులే కమిటీ మెంబర్లుగా ఉంటారని తెలిపారు. అగ్రికల్చర్ ఎఒ రవికుమార్, ఐసిడిఎస్ ఆఫీసర్ సావిత్రి, ఎంఇఒ రంగస్వామి, గ్రామ సర్పంచి సుహాసిని, ఎంపిపి అనిత యాదవ్, జడ్పిటిసి మురళీధర్ రెడ్డి, మాజీ ఎంపిపి మల్లికార్జున యాదవ్, మాజీ ఎంపిపి డిఎస్ యాదవ్ గ్రామపంచాయతీ సలహాదారుడు బండారు ఆంజనేయులు, ఎంపిటిసిలు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ నరసింహామూర్తి

గణేష్ పత్రిక అక్రిడేషన్‌ను పునరుద్ధరించాలి

ఎపిడబ్ల్యుజెఎఫ్ ,జెఎసి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గణేష్ పత్రిక ఎడిటర్ సత్యనారాయణ గుప్తా అక్రిడేషన్ కార్డును కాంగ్రెస్ పార్టీ లో ప్రధాన కార్యదర్శిగా ఉంటూ, అధికారిక పర్యక్రమాల్లో పాల్గొన్నారన్న నెపంతో అక్రిడేషన్ కార్డును రద్దు చేయడం గురించి ఎపిడబ్ల్యుజెఎఫ్, జెఎసి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సృజనను కలిసి వినతిని అందించడం జరిగింది. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.మద్దిలేటి, జెఎసి చైర్మన్ సత్యన్న , ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చిన్న రామాంజనేయులు, నగర అధ్యక్షులు శివ కుమార్, నగర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రమోహన్ ,నగర నాయకులు శ్రీరామ్, ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా నాయకులు సుబ్రహ్మణ్యం, తదితరులు వినతిని అందించి మాట్లాడారు. 30 సంవత్సరాలు జర్నలిస్ట్ వృత్తిలో ఉన్నారని అలాంటి వ్యక్తికి ఎలాంటి ముందస్తు నోటీస్ ఇవ్వకుండా అక్రిడేషన్ రద్దు చేయడం బాధాకరమన్నారు. ఒక ప్రజా ప్రతినిధిగా ఆయన లేరని అధికారులు 16 (ఏ) ప్రకారం తొలగించినట్టు కనపరిచారని, ఆ జిఒలో ఎక్కడ కూడా పార్టీల్లో పని చేసే వారికి అక్రిడేషన్ కార్డు తొలగించాలనే నియమం లేదని కలెక్టర్‌కు తెలిపారు. వెంటనే సత్యనారాయణ గుప్తా అక్రిడేషన్ కార్డుని పునరుద్ధరించాలని కోరారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ సృజన ఇలాంటి విషయం నా దృష్టికి రాలేదని ఫైల్ పెట్టారు చర్యలు తీసుకోమన్నాం పూర్తి వివరణ డిడితో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

సెల్ టవర్‌ను తొలగించేంత వరకు పోరాటం

ప్రజా పరిరక్షణ కమిటీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 35వ వార్డు మాదిరాజు నగర్‌లో గోవింద్ ఇంటిపై నిర్మించిన సెల్‌టవర్‌ను తొలగించేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని మాదిరాజు నగర్ ప్రజా పరిరక్షణ కమిటీ నాయకులు అన్నారు. గురువారం సెల్‌టవర్ దగ్గర నిరసనను తెలియజేసి అక్కడ నుండి ర్యాలీగా ముజఫర్ నగర్,సుందరయ్యనగర్, గంగావతి నగర్ మీదుగా ఎస్టేట్‌లో ఉన్న 91వ సచివాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు పరిరక్షణ కమిటీ నాయకులు ధనరాజ్ అధ్యక్షత వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప మాట్లాడుతూ గత మూడు రోజులుగా సెల్ టవర్‌ను తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కు, డిఆర్‌ఒకు వినతి పత్రాలు ఇచ్చామని, ఇంతవరకు సెల్‌టవర్ తొలగించడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.సెల్ టవర్ ఏర్పాటు చేసే ప్రాంతంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో వందలాది మంది విద్యార్థులు చదువుతున్నారని, అదే ప్రాంతంలో ప్రజలు నివాసం ఉండి వృద్ధులు గర్భిణీ స్త్రీలు బాలింతలు పసి పిల్లలు ఉన్నారని, సెల్ టవర్ నుండి వచ్చే రేడియేషన్ వల్ల అనారోగ్యాల పాలు కావాల్సి వస్తుందని తెలిపారు. ఒకపక్క మున్సిపల్ అధికారులు స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ పేరుతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రయత్నం చేస్తుంటే మరోపక్క సెల్ టవర్లను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాన్ని దహించి వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మునీర్ ,సునీల్ ,దానం, దేవదానం,కిషోర్, ఇస్మాయిల్, శారదమ్మ, సాలమ్మ, గోవిందమ్మ, కనక మహాలక్ష్మి ,కళావతి, నాగమణి, లక్ష్మి దేవి, చాంద్‌బీ, నాగ పూర్ణిమ, ఫాతిమా మహిళలు యువకులు పాల్గొన్నారు.

ప్రజాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న స్థానికులు

26న నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈ నెల 26న గణేష్ నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ భవనంలో గణేష్ నిమజ్జనం పై జిల్లా కలెక్టర్ సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరం తర్వాత కర్నూలులో భారీ ఎత్తున నిమజ్జనం జరుగుతుందన్నారు. గణేష్ నిమజ్జనం కోసం 0.2 టిఎంసి నీటిని మాత్రమే విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. నీటి వనరులను వృథా కాకుండా ఇంట్లో ఏర్పాటు చేసుకున్న మట్టి విగ్రహాలను ఇంట్లోనే నిమజ్జనం చేసే విధంగా ప్రజలకు తెలియచేయాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జనోత్సవం సజావుగా జరిగేలా పోలీస్ బందోబస్తు చేయాలని కలెక్టర్ పోలీస్ అధికారులకు సూచించారు. నిర్దేశించుకున్న రూట్ మ్యాప్ ఉల్లంఘించకుండా చూడాలని సూచించారు. ముందుగా ఏ విగ్రహం వెళ్తే ఆ విగ్రహమే నిమజ్జనం జరగాలన్నారు. మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిమజ్జన ఘాట్ పరిసరాల్లో ప్రకాశవంతమైన విద్యుత్ దీపాలను, పెయింటింగ్ పనులు, ఘాట్‌లను శుభ్రపరిచే పనులు మొదలు పెట్టడం జరిగిందన్నారు. ఘాట్ వద్ద ప్యాచ్ వర్క్స్, అడ్డంగా ఉన్న కేబుల్ వైర్ల తొలగింపు చేపడతామన్నారు. అదనపు ఎస్పి టి.సర్కార్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జన సమయంలో 1548 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. డిఆర్‌ఒ మధుసూదన్ రావు, వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణన్న, నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, ఉపాధ్యక్షుడు హరీష్, జిల్లా సమన్వయ కార్యదర్శి నాగఫణి శాస్త్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, కోశాధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ఏ తప్పు చేయని చంద్రబాబు

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జోక్యం చేసుకోవాలి

నిరాహార దీక్షలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు ఏతప్పు చేయలేదని టిడిపి నాయకులు అన్నారు. చంద్రబాబును అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం టిడిపి ఆధ్వర్యంలో నిరాహారదీక్షలు నిర్వహించారు. 10 రోజు కర్నూలు ధర్నా చౌక్‌లో కర్నూలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి టిజి.భరత్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్ సంఘీభావం తెలిపారు. టిజి.భరత్, నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అక్రమంగా చంద్రబాబును అరెస్టు చేయించారన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు విషయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జోక్యం చేసుకోవాలని టిజి.భరత్ అన్నారు. చంద్రబాబుకు మద్దతుగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపేందుకు ఆయన ప్రజల నుండి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

జగన్ పాలనను కోరుకుంటున్న ప్రజలు

- వైసిపి రాష్ట్ర యువ నాయకులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ప్రజలతో మాట్లాడుతున్న ప్రదీప్ రెడ్డి

ప్రజలు జగన్ ప్రభుత్వాన్ని మళ్లీ కోరుకుంటున్నారని వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కౌతాళం మండలంలోని కుంబళనూరు గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగానికి పెద్ద పీట వేసినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా అర్హులు ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వైసిపి నాయకులు రామలింగయ్య స్వామి, సర్పంచి వీరేష్, నాయకులు రామన్న గౌడ్, హళ్ళి చెన్నప్ప, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అశ్వత్థామ, ఎంపిడిఒ సుబ్బ రాజు, విద్యా శాఖ అధికారి శోభా రాణి, విద్యుత్ ఎఇ నరసన్న, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

దాణాను సద్వినియోగం చేసుకోండి

- వైసిపి మండల యువ నాయకులు జాటూరు మారయ్య, సర్పంచి గోవిందరాజులు

ప్రజాశక్తి - చిప్పగిరి

దాణాను పంపిణీ చేస్తున్న మారయ్య, గోవిందరాజులు

పశువులకు ఉపయోగ పడే దాణాను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వైసిపి మండల యువ నాయకులు జాటూరు మారయ్య, సర్పంచి దాసరి గోవిందరాజులు సూచించారు. శుక్రవారం చిప్పగిరిలోని పశు వైద్యశాలలో పశు వైద్యులు ప్రసన్న బాయ్, మహేష్ ఆధ్వర్యంలో టివిఆర్ పథకం కింద మంజూరైన దాణా సంచులను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం పశుసంపద కోసం దాణాను రాయితీ కింద ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. ఒక రైతుకు 1800 కిలోల వరకు తీసుకోవచ్చన్నారు. 200 కిలోలకు అసలు ధర రూ.3160 ఉంటుందని, దీనిలో 60 శాతం రాయితీ పోను రైతులకు కేవలం రూ.1300కు అందజేస్తోందని చెప్పారు. మండలంలో పశు సంపద ఉన్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పశుసంపదకు, పాలు ఎక్కువగా రాబట్టేందుకు ఉపయోగించుకోవాలని రైతులను కోరారు. ఎంపిడిఒ కొండయ్య, పంచాయతీ కార్యదర్శి బాలన్న, పశు వైద్యశాల సిబ్బంది నీలకంఠ, నారాయణ, దేవర రామయ్య, నాని, రైతులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి-ఆలూరు

కృష్ణకుమార్‌ను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆలూరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న కృష్ణ కుమార్ ఇఒఆర్‌డిగా పదోన్నతిపై నంద్యాల జిల్లా ముడిగుట్లకు బదిలీపై వెళ్తుండగా సన్మానించారు. శుక్రవారం ఎంపిడిఒ అల్లాబకాష్, ఆలూరు ఇఒఆర్‌డి ప్రకాష్ నాయుడు, సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యదర్శిగా గ్రామాభివృద్ధికి, కిందిస్థాయి ఉద్యోగుల సమన్వయంతో పనులు చేయించి అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యదర్శి కృష్ణకుమార్ మాట్లాడుతూ... ప్రజాసేవకు, గ్రామాభివృద్ధికి సహకరించిన ఉన్నతాధికారులకు, పంచాయతీ, సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కేటాయించిన విధులను సక్రమంగా చేసి ప్రజలు, అధికారుల మన్ననలు పొందాలని సిబ్బందికి సూచించారు.

ఈ-పాస్ మిషన్లను అప్‌డేట్ చేయాలి

- ఎడిఎ మహ్మద్ ఖాద్రీ

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని ఫెర్టిలైజర్స్ నిర్వాహకులు ఈ-పాస్ మిషన్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని ఎడిఎ మహ్మద్ ఖాద్రీ సూచించారు. శుక్రవారం మండలంలోని మాధవరం, తుంగభద్ర గ్రామాల్లోని మారుతి ట్రేడర్స్, పంచముఖి ట్రేడర్స్, భీమా ట్రేడర్స్, సిద్ధి వినాయక ట్రేడర్స్, శ్రీరామ్ ట్రేడర్స్ దుకాణాలను ఎఒ గణేష్‌తో కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో గల ఎరువుల నిల్వల వివరాలు, రైతులకు ఇస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిల్వల్లో తేడాలు వస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పురుగు మందులు శ్యాంపిల్స్‌ను పరీక్ష నిమిత్తం తీసుకున్నారు. ఎఇఒ నరసింహులు ఉన్నారు.

తెగని పేచి

- విలువైన భూమిని అప్పనంగా కాజేసే యత్నం

- కడుపు కొట్టొద్దంటున్న కొఠారి మిల్లు కార్మికులు

ప్రజాశక్తి - ఆదోని

ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమ మూతపడడంతో వందలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం, పాలకులు చోద్యం చూస్తుండడంతో కార్మికుల ఆక్రందన వినే వారే కరువయ్యారు. గ్రాట్యుటీ, ఇతర ఆర్థిక ప్రయోజనాల కోసం దశాబ్ద కాలంగా కార్మికులు ఎదురు చూస్తున్నారు. 40 ఏళ్ల క్రితం ఆదోనిలో కొఠారి మిల్లు, రాయిమిల్లు, ఎంఎం మిల్లు, ఎటిటిఆర్ ఫ్యాక్టరీ పరిశ్రమలు ఏర్పాటుతో వేలాది మంది కార్మికులు ఉపాధి పొందేవారు. చేతినిండా పని లభిస్తుండడంతో ఆదోని అభివృద్ధి పథంలో ఉండేది. అన్ని మిల్లులూ మూతపడ్డాయి. ప్రస్తుతం ఉపాధి కరువై కార్మికులు రోడ్డున పడి, కొందరు ఆకలి చావులకు గురయ్యారు. సమస్యను పరిష్కరించాల్సిన యజమానులు, పాలకులు కార్మికుల కడుపు కొట్టే విధంగా వ్యవహరిస్తున్నారు.

ఆర్థిక ప్రయోజనాల కోసం దశాబ్ద కాలంగా ఎదురుచూపులు

పట్టణంలోని ఆలూరు రోడ్డులో ఉన్న కొఠారి మిల్లు 2008లో అక్రమంగా లాకౌట్‌కు గురైంది. కార్మికులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు ఇవ్వకుండానే యాజమాన్యం కాలయాపన చేస్తూ వారి సహనాన్ని పరీక్షిస్తోంది. మిల్లులో 241 మంది పర్మినెంట్, సబ్ సిట్ పద్ధతిలో 249, క్యాంటీన్ వర్కర్స్ 13 మంది, స్టోర్, క్లీనింగ్ 181 మంది 12 మంది ఆడవాళ్లు అప్పట్లో పని చేసేవారు. మొత్తంలో సుమారు 200 మంది కార్మికులు ఆర్థిక ప్రయోజనాలు తీసుకోకుండానే చనిపోయారు. పరిశ్రమలో సుమారు 772 మంది కార్మికులు ఉపాధి పొందేవారు.

కోర్టులో గెలిచినా పరిష్కారం కాని సమస్య

యాజమాన్యం నుంచి ఆర్థిక ప్రయోజనాల కోసం కార్మికులు కోర్టుకెళ్లారు. 15 ఏళ్ల క్రితం కార్మికులకు కోర్టు అనుకూలంగానే తీర్పు ఇచ్చింది. సుమారు రూ.15 కోట్ల అవార్డు కార్మికులకు ఇవ్వాలని తీర్పు వెల్లడించారు. కోర్టులో గెలిచినా సమస్య పరిష్కరించకుండా యాజమాన్యం, ప్రజా ప్రతినిధులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

తెగని పేచి

పట్టణంలోని ఆలూరు రోడ్డులో 33 ఎకరాల విస్తీర్ణంలో కొఠారి మిల్లు ఉండేది. ప్రస్తుతం ఆ స్థలం మార్కెట్ విలువ సెంటు రూ.3 లక్షలు ఉంటుందని కార్మికులు చెబుతున్నారు. ఆ లెక్కన ఆస్తి విలువ సుమారు రూ.100 కోట్లు. రూ.10 కోట్లు ఇస్తే చాలని, ఇటీవల చర్చల్లో ప్రస్తావించినా రూ.9 కోట్లు మాత్రమే ఇప్పిస్తామని వైసిపి నాయకులు చంద్రకాంత్ రెడ్డి చెప్పడం భావ్యం కాదంటూ పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. 23 రోజుల వేతనం, మూడేళ్ల బోనస్, అక్రమంగా లాకౌట్ కావడం వల్ల 90 రోజుల వేతనం ఇవ్వాలని, ఆ లెక్కన ఒక్కో కార్మికునికి రూ.3 లక్షలు వస్తుందని కార్మికులు ఆశతో ఉన్నారు. రూ.కోట్ల విలువ చేసే ఆస్తిని అప్పనంగా కాజేసేందుకే యత్నించడం ఎంతవరకు సమంజసమంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆ స్థలం సమీపంలోనే బైపాస్ రోడ్డు, వైఎస్ఆర్, భీమ్ రెడ్డి కాలనీ నివాసాలు ఉన్నాయి. ఆ స్థలానికి ప్రస్తుతం మంచి డిమాండ్ ఉందని కార్మికులు చెబుతున్నారు. కార్మికులకు న్యాయం చేసి ఆదుకోవాలని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డిని కార్మికులు కోరుతున్నారు.

కార్మికులందరికీ న్యాయం చేయాలి

- ఈరన్న, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

కొఠారి మిల్లు కార్మికులందరికీ న్యాయం జరిగేలా యాజమాన్యం చొరవ చూపాలి. కోర్టు తీర్పు వెలువడి దశాబ్ద కాలం గడిచినా ఇప్పటికీ న్యాయం జరగలేదు. ఆస్తులున్నా కార్మికులకు బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం తగదు. ప్రతి కార్మికునికీ ఆర్థిక ప్రయోజనం కల్పించే దిశగా కృషి చేస్తున్నాం. త్వరలోనే చర్చలు సఫలమయ్యేలా ఎమ్మెల్యే చొరవ చూపాలి.

మొక్కలను నాటుదాం...

- వైసిపి నాయకులు

ప్రజాశక్తి -పెద్దకడబూరు

మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని వైసిపి నాయకులు కోరారు. శుక్రవారం శ్మశాన వాటిక చుట్టూ వైసిపి నాయకులు బోయ అల్లయ్య మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని కంబాలదిన్నె గ్రామంలో గతంలో సొంత నిధులతో ముళ్లకంపను తొలగించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి రాష్ట్ర యువ నేత ప్రదీప్ రెడ్డి, వైసిపి నాయకులు పురుషోత్తం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి సహకారంతో మొక్కలు నాటినట్లు చెప్పారు.

జిల్లాస్థాయి పోటీలకు 'తెర్నేకల్' విద్యార్థులు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్‌డిఎస్.జ్యోతి, సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. ఆలూరు తాలూకా పరిధిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 19 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల నుంచి కబడ్డీ అండర్- 17 పోటీలకు ముగ్గురు, కబడ్డీ అండర్-14కు ఇద్దరు, ఖోఖో అండర్-17కు ఏడుగురు, ఖోఖో అండర్-14కు ముగ్గురు, అథ్లెటిక్స్‌లో విద్యార్థులు జిల్లా పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ ఎంపికకు కృషి చేసిన పిఇటి ఎన్.వీణ, గాదె రోషన్న, మధుసూదన్ రెడ్డి, సోషల్ ఉపాధ్యాయులను సర్పంచి ప్రత్యేకంగా అభినందించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కోసిగి

రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కోసిగిలోని రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంటుంది. జిఆర్‌పిఎఫ్ ఎస్.రామస్వామి, ఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ అనంతయ్య వివరాల మేరకు... కోసిగి రైల్వే గేట్ సమీపంలో సిగ్నల్ వద్ద అనుమానస్పదంగా 50 ఏళ్ల వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. మృతి చెందిన వ్యక్తి తెలుపు రంగు చొక్కా, కాషాయ రంగు లుంగీ ధరించి ఉన్నారు. రైల్వే పోలీసుల సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది సంజయ్, మహేంద్ర పాల్గొన్నారు.

పాత పింఛను విధానం అమలు చేయాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - ఆదోని

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని ఎస్‌టియు రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ జి.వీరచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోనిలోని ఎస్‌టియు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వారంలోనే సిపిఎస్ రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి మరిచారని విమర్శించారు. 30 ఏళ్లు ప్రభుత్వానికి, ప్రజలకు సేవ చేసిన ప్రభుత్వ ఉద్యోగుల జీవితాలకు విరమణ తర్వాత భద్రత కలిగించే పింఛను ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత అని తెలిపారు. ఎలాంటి హామీ ఇవ్వని చిన్న రాష్ట్రాలైన ఛత్తీస్‌ఘడ్, పంజాబ్, రాజస్థాన్, జార్ఖండ్, సిక్కిం సిపిఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేస్తుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాధ్యం కాదని చెప్పడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి జిపిఎస్ ప్రతిపాదనను విరమించుకుని ఇచ్చిన హామీ మేరకు ఒపిఎస్‌ను అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. లేకపోతే ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

చంద్రబాబు అరెస్టు అక్రమం

- తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబు

ప్రజాశక్తి - ఆదోని

గోదావరి జలాలను, కృష్ణా జలాలకు అనుసంధానం చేసి సాగుకు నీరందించిన అపర భగీరథుడు చంద్రబాబు నాయుడు అరెస్టు అక్రమమని తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి, దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారులు పి.సాయిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు మద్దతుగా డివిజన్‌లో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో పాల్గొని కార్యకర్తలను, ప్రజలను చైతన్య పరిచినట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టును గతంలో అనేకమంది ముఖ్యమంత్రులు శంకుస్థాపనలు చేశారే తప్ప ఎవరూ పనులు చేపట్టలేదని చెప్పారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నాంది పలికి 5 ఏళ్లలో 71 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 2014లో ప్రమాణ స్వీకార సభలోనే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ఎన్‌డిఎ పాలకుల నుంచి స్పష్టమైన హామీని పొందారని, సుమారు రూ.50 వేల కోట్ల నిధులు సాధించి పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించే విధంగా చేశారని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డుగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేయించి నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులూ లేకుండా కృషి చేశారని అన్నారు. పట్టిసీమకు గోదావరి జలాలను కృష్ణా నదికి అనుసంధానం చేస్తూ అక్కడి రైతులకు సాగునీరందించి మిగిలిన కృష్ణా జలాలను రాయలసీమలోని నాలుగు జిల్లాలకు హంద్రీనీవా ద్వారా అందించారన్నారు. చంద్రబాబు హయాంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కడప జిల్లాకు, పులివెందుల నియోజకర్గానికి కూడా సాగునీరు అందించారని తెలిపారు. కర్నూలు జిల్లాలోని గురు రాఘవేంద్ర, హంద్రీనీవా పథకం పూర్తి చేయడం, వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి నాంది పలికారని చెప్పారు. తుంగభద్ర నదిపై ఆర్‌డిఎస్ ఆనకట్ట ద్వారా కుడి కాలువ నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి పనులు చేపట్టడం, గుండ్రేవుల పథకం నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. చంద్రబాబును బేషరతుగా విడుదల చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా నాయకులు నారాయణస్వామి

ప్రజాశక్తి-ఆలూరు

దళితుల ఆత్మగౌరవం, ఉపాధి, సంక్షేమం, భద్రత కోసం కెవిపిఎస్ ఆధ్వర్యంలో దళిత రక్షణ యాత్రలో భాగంగా ఈనెల 22 నుంచి 25 వరకు నిర్వహించే జీపు జాతాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కెపి.నారాయణ స్వామి కోరారు. శుక్రవారం పట్టణంలో దళిత రక్షణ యాత్ర కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దళితులపై రోజూ ఎక్కడో ఒకచోట కులవివక్ష, దాడులు, భూఆక్రమణ, లైంగిక వేధింపులు జరుగుతున్నాయని తెలిపారు. వాటిని నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు. 29న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. రంగప్ప, మైనా, పురుషోత్తం, గోవర్ధన్ పాల్గొన్నారు.

కోసిగి : ఈనెల 22 నుంచి 25 వరకు జిల్లాలో జరిగే దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి రామకోటి హనుమంతు, మండల నాయకులు ముకురన్న, దిలీప్, ప్రకాష్ కోరారు. శుక్రవారం వారు మాట్లాడారు. దళితులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయడం లేదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయడం లేదన్నారు. దళిత, వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈనెల 22 నుంచి 25 వరకు జిల్లాలో జీపు జాతా నిర్వహించి 29న విజయవాడలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాతా 23న సాయంత్రం 6 గంటలకు కోసిగి చేరుకుంటుందని, ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో సభ నిర్వహిస్తామని చెప్పారు. మండలంలోని దళితులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అంగన్వాడీలకు కనీస వేతనమివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని, 25న చలో విజయవాడను జయప్రదం చేయాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, అర్బన్ కమిటీ కార్యదర్శి ఎస్.నాగలక్ష్మి కోరారు. శుక్రవారం ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని, జీతాలు పెంచుతామని పాదయాత్ర సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. నాలుగేళ్లు పూర్తయినప్పటికీ నెరవేర్చలేదని విమర్శించారు. గ్రాట్యుటీ ఇవ్వాలని, పింఛను సౌకర్యం కల్పించాలని, అనవసరమైన యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న టిఎ, డిఎలను విడుదల చేయాలని కోరారు. పార్వతి, నాగలక్ష్మి, సుజాత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఖరీఫ్ ప్రశ్నార్థకం...

- వర్షాల్లేక ఎండుతున్న పంటలు...

- ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి - హొళగుంద

ఈఏడాది వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో ఖరీఫ్ సీజన్ ప్రశ్నార్థకంగా మారింది. సరైన వర్షాల్లేక రైతులు సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి. జులై, ఆగస్టు నెలల్లో బంగాళ ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారడం తో మంచి వర్షాలు కురుస్తాయని రైతులు ఆశించారు. రైతులకు అడియాశలే మిగిలాయి. చదురుముదురు వర్షాలే కురిశాయి. మండలంలో ఏ పంట పొలం కూడా సంపూర్ణంగా తడవలేదు.

మండలంలో 17 పంచాయతీలు, 6 మజరా గ్రామాలు కలిపి 23 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఖరీఫ్ సాగు కోసం 38,332.5 ఎకరాలను రైతులు సిద్ధం చేసుకున్నారు. కేవలం బోరుబావుల కింద, అరకొర వర్షాలకు 34,432.5 ఎకరాల్లో సాగు జరిగింది. ఆ పంటలు సైతం వర్షాల్లేక ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

ఈ ఏడాదీ వలసలు తప్పవా..?

ఈఏడాది కూడా వలసలు తప్పవా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన వర్షాలు కురవక పంట దిగుబడి సరిగ్గా వచ్చే పరిస్థితి లేదు. కుటుంబ పోషణ కోసం వలసలు వెళ్లాల్సి వస్తుందని, రెండు, మూడు సార్లు పొలాల్లో విత్తనాలు వేసి నష్టపోయామని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు లేక పంటలు ఎండుముఖం పట్టాయి.

పనుల్లేక అల్లాడుతున్న కూలీలు : మండలంలో మంచి వర్షాలు కురవకపోవడంతో వ్యవసాయ కూలీల సైతం పనుల్లేక అల్లాడుతున్నారు. గతేడాది జూన్, జులైలో వర్షాలు కురవడంతో వ్యవసాయ కూలీలకు మంచి డిమాండ్ ఉండేది. రూ.250 నుంచి రూ.300 వరకు కూలి ఇచ్చేవారు. ఈ ఏడాది పనులు కల్పించి రూ.200 ఇచ్చేవారు కూడా కరువయ్యారు. ఉపాధి హామీ పనులకు వెళితే సకాలంలో కూలిలు అందడం కష్టంగా మారిందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో సభ్యులు

జిపిఎస్ ఆమోదంపై నిరసన

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పింఛను స్థానంలో జిపిఎస్ అమలు చేయాలని రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదించడంపై శుక్రవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. మండలంలోని హెచ్.కైరవాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ గట్టు తిమ్మప్ప, ప్రధానోపాధ్యాయులు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ... జిపిఎస్ అమలుపై నిరసనలో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యారన్నారు. 23న సాయంత్రం అన్ని తాలూకా కేంద్రాల్లో జరిగే నిరసన ప్రదర్శనలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే 25న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

పాత పింఛను విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి- దేవనకొండ

జిపిఎస్, సిపిఎస్‌ను రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని డిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రోషన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తెర్నేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ కు బదులు జిపిఎస్ అమలు చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఉద్యోగులు నష్టపోతారని తెలిపారు. జిపిఎస్, సిపిఎస్‌ను రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

బాబుపై కక్ష సాధింపు వీడాలి

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు విడనాడాలని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం టిడిపి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బీవీ నాయకత్వంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు పదో రోజుకు చేరాయి. 10వ రోజు రిలే నిరాహార దీక్షలను ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిశీలకులు శ్రీరాములుతో కలిసి నిర్వహిస్తూ 'మేము సైతం - బాబు కోసం' అంటూ నినదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్ పేరుతో యువతకు నైపుణ్యాలు నేర్పిస్తే, స్కీం పేరుతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేయడం అప్రజాస్వామికమని తెలిపారు. సిఐడిని అడ్డు పెట్టుకొని వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి తెలుగు వాడు చంద్రబాబు పక్షాన నిలబడ్డాడని తెలిపారు. నాయకులు దయాసాగర్, రాందాస్ గౌడ్, రంగస్వామి గౌడ్, మధుబాబు, సుందర్ రాజు, తురేగల్ నజీర్ అహ్మద్, కలీముల్లా, కటారి రాజేంద్ర, మాబు సాహెబ్ పాల్గొన్నారు. **మంత్రాలయం**లోని రాఘవేంద్ర సర్కిల్‌లో 'మేము సైతం' అంటూ కోసిగి మండల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జీలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి సోదరుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. చంద్రబాబుపై ఎన్ని కుట్రలు చేసినా కడిగిన ముత్యంలా బయటికి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కోసిగి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జీలు జ్ఞానేష్, భరద్వాజ్ శెట్టి, జంపాపురం కృష్ణారెడ్డి, ఐరన్‌గల్ శివ, రామచంద్ర నాయుడు, రవితేజ శెట్టి, చిన్నభూంపల్లి మాజీ సర్పంచి నరసింహులు, సాతనూరు ఉలిగయ్య, వెంకటేష్, కోసిగి శ్రీనివాస్, బెళగల్ గుండేష్, ఉసేని, దొడ్డయ్య, హనుమంతు రెడ్డి, హనుమంతు, మారేష్, నర్సారెడ్డి, రామాంజినేయులు దీక్షల్లో కూర్చున్నారు. తెలుగు యువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పన్నగ నాగశయన స్వామి, బీసీ సీనియర్ నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, గోపాల్ రెడ్డి, పెద్దకడబూరు మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, కోసిగి టౌన్ అధ్యక్షులు పంపాపతి, కొండగేని వీరారెడ్డి, అశోక రెడ్డి, తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, వట్టెప్ప గారి నరసింహులు, మేకల నరసింహులు, రామకృష్ణ, ఎంపిటిసి రాజు, నక్కే వెంకటేష్, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు మారెప్ప, ఏబు, వగరూరు అబ్దుల్, పవన్ కూమర్ రెడ్డి, గోపాల్, దస్తగిరి, కందుకూరు రామన్న గౌడ్, అయ్యన్న, గవిగట్టు ఈరయ్య, గుండాల ఈరయ్య, ఐ టిడిపి సల్మాన్ రాజు, నీలకంఠ, లింగప్ప, హనుమంతు పాల్గొన్నారు. **ఆలూరు**లో టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు టిడిపి రైతు కమిటీ తాలూకా అధ్యక్షులు కురువ దేవేంద్రప్ప ఆధ్వర్యంలో సామూహిక నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కురువ జయరామ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి, అల్లారుదిన్నె కురువ మల్లయ్య, కురువ దర్గన్న మాట్లాడారు. సర్పంచులు సుధాకర్, శేషప్ప, ఎల్లప్ప, మండల కన్వీనర్ అశోక్ యాదవ్, రఘు ప్రసాద్ రెడ్డి, నారాయణ, ఎల్లార్తి దర్గన్న, టిడిపి జిల్లా నాయకులు నరసప్ప, కిషోర్, కొమ్ము రామాంజి, నాగరాజు, కమ్మరచేడు కుమార్, పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, గూళ్యం కుమార స్వామి, ధర్మాన, ముద్ద రంగ, గూళ్యం రామాంజినేయులు, గాదిలింగ, మారెప్ప, గజ్జెళ్లి బొజ్జప్ప, రంగయ్య, లక్ష్మన్న, కెకెడి ఉచ్చ వీరప్ప, కురువ అయ్యళ్లి, వీరనాగప్ప పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న బీవీ



మంత్రాలయంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి



ఆలూరులో మాట్లాడుతున్న కురువ జయరామ్

అశేష జనవాహిని మధ్య గణేశుని శోభయాత్ర

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో వైభవంగా గణేష్ నిమజ్జన మహోత్సవం సాగింది. అశేష జనవాహిని మధ్య గణేశుని శోభయాత్ర సాగింది. ఈనెల 18 నుంచి పూజలందుకున్న గణేశుని శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. పట్టణంలో సుమారు 450 విగ్రహాలు ప్రతిష్టించారు.

ఆలస్యంగా తరలిన విగ్రహాలు

పట్టణంలో ప్రతిష్టించిన విగ్రహాలు మధ్యాహ్నం 3 గంటల సమయం మీరినా తరలింపు ప్రక్రియ మొదలు కాలేదు. డిజెకు అనుమతి ఇవ్వడంతో విగ్రహ తరలింపు అర్ధరాత్రి వరకు సమయం పట్టవచ్చని అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా సుమారు 800 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ శివ నారాయణస్వామి తెలిపారు. చిన్నహరివాణం ఎల్ఎల్‌సి కాలువలో గణేష్ నిమజ్జనం ఉండడం వల్ల అక్కడ అన్ని ఏర్పాట్లు చేసినట్లు సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహశీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపిడిఒ గీతావాణి పర్యవేక్షించారు.

పోటాపోటీగా లడ్డు వేలం

పట్టణంలోని గణేశుని శోభాయాత్రకు ముందు విహెచ్‌పి కార్యాలయం ముందు ప్రతిష్టించిన విగ్రహాన్ని ముందుగా నిమజ్జనానికి తరలించడం ఆనవాయితీ. అక్కడ గణేశుని ముందు ఉంచిన లడ్డు వేలానికి నిర్వాహకులు ఏర్పాటు చేశారు. వేలాన్ని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ప్రారంభించారు. వేలం పోటాపోటీగా సాగింది. భారత్ గ్యాస్ యజమాని, కౌన్సిలర్ సందీప్ రెడ్డి లడ్డును వేలంలో రూ.1,10,116కు దక్కించుకున్నారు. పూజకు ఉంచిన లడ్డుకు వేలం నిర్వహించగా ఆర్‌సిసి వర్కింగ్ ప్రెసిడెంట్, వ్యాపారవేత్త శ్రీకాంత్ రెడ్డి రూ.40,116కు దక్కించుకున్నారు. ఈ వేలంలో వైసిపి నాయకులు జయ మనోజ్ రెడ్డి, టిడిపి నాయకులు గుడిసె కృష్ణమ్మ, పుర ప్రముఖులు చంద్రకాంత్ రెడ్డి, నీలకంఠప్ప, ఎగటి ప్రతాప్, కునగిరి నాగరాజు, కునగిరి నీలకంఠ, మున్సిపల్ ఛైర్మన్ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ నాగభూషణం రెడ్డి, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, అశోక్, బాలాజీ, కాంగ్రెస్ నాయకులు నీలకంఠప్ప, దేవిశెట్టి ప్రకాష్, విహెచ్‌పి నాయకులు బసవన్న గౌడ్, నాగరాజ్ గౌడ్, శ్రీనివాస్ ఆచారి, నాగరాజు ఉన్నారు.

లడ్డు వేలంలో పాల్గొన్న పుర ప్రముఖులు

తిక్కారెడ్డిని విమర్శించే స్థాయి కాదు...

- నకిలీ విత్తనాలతో విశ్వనాథ్ రెడ్డి మోసం - క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి, చావిడి వెంకటేష్

ప్రజాశక్తి - మంత్రాలయం

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డిని విమర్శించే స్థాయి విశ్వనాథ్ రెడ్డికి లేదని టిడిపి నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జీ చిలకలడోన ఎల్లారెడ్డి, చావిడి వెంకటేష్ విమర్శించారు. శుక్రవారం స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో దీక్ష శిబిరం వద్ద వారు మాట్లాడారు. మండలంలోని రైతుల భూములను మండల అధికారుల సహకారంతో ఆన్‌లైన్‌లో తొలగించి, మళ్లీ మధ్యవర్తిగా రైతుల వద్ద డబ్బులు వసూలు చేసి విశ్వనాథ్‌రెడ్డి ఆన్‌లైన్‌లో ఎక్కించారని తెలిపారు. ఎమ్మెల్యే విమర్శించినందుకు ప్రతిపక్ష నేతగా తిక్కారెడ్డి స్పందించారని, మధ్యలో విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు. నాడు కేశవరెడ్డి పుణ్యాన విశ్వనాథ్‌రెడ్డి తండ్రి సొసైటీ అధ్యక్షులు అయ్యారని, మండల ఇన్‌ఛార్జీగా ఉన్న విశ్వనాథ్‌రెడ్డి వగరూరు గ్రామానికి చేసిందేమి లేదని విమర్శించారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మి సొమ్ము చేసుకున్న విశ్వనాథ్‌రెడ్డి తిక్కారెడ్డి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. ఇప్పటికీ షాపూర్‌లో నకిలీ విత్తనాల కేసు ఉందని చెప్పారు. ఎమ్మెల్యేతో బంధుత్వం ఉండడంతో ఆయనేదో గొప్పగా ఊహించుకుని, వగరూరులో కర్ణాటక మద్యం అమ్మకాల మామూళ్లు అందుతున్నాయని తెలిపారు. కాలువల శుభ్రం కోసం మండలంలోని రైతుల నుంచి రూ.500 చొప్పున వసూలు చేశారని, చేపల చెరువుల్లో కమీషన్లు తీసుకుంటున్నారని విమర్శించారు. నాడు ఎల్ఎల్‌సి కాలువ ద్వారా నీరు వృథాగా వెళ్తున్నాయని, ఆ నీటిని నిల్వ చేసేందుకు రూ.కోటి విలువ చేసే భూమిని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి రైతుల కోసం తిక్కారెడ్డి ఇచ్చారని చెప్పారు. దీనిపై వైసిపి నేత ప్రదీప్ రెడ్డి ధర్నా చేసి రైతులకు నీరు విడుదల చేయించారని చెప్పారని, అది అవాస్తవమని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. జగనన్న ఇళ్లలో కమీషన్లు తీసుకొని బిల్లులు చేయించిన విషయం తమకు తెలుసన్నారు. వైసిపి అవినీతికి సంబంధించిన ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని, ధైర్యం ఉంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. అబ్దుల్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, నాయకులు గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

అంబటి రాంబాబూ.. నోరు అదుపులో పెట్టుకో..!

- బాలకృష్ణ అభిమానులు హెచ్చరిక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



వైసిపి ప్రభుత్వంలో అపద్ధాల మంత్రి అంబటి రాంబాబు నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు రంగస్వామి గౌడ్, చంద్ర హెచ్చరించారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణనుద్దేశించి 'రా.. రా.. దమ్ముంటే.. రా.. చూసుకుందాం' అంటూ అంబటి రాంబాబు అనవసరంగా రెచ్చగొట్టారని తెలిపారు. బాలకృష్ణపై తొడ గొడుతూ ఒక వీధి రౌడీలా ప్రవర్తించడం హేయమైన చర్య అని చెప్పారు. బాలకృష్ణకు తల్లి లాంటి సినిమా రంగంపై నానా దుర్భాషలాడుతూ సినిమా రంగాన్ని కించపరచి మాట్లాడటం సరి కాదన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఇది మంచి పద్ధతి కాదని తెలిపారు. రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లో ఉన్నాయని చెప్పారు. నందమూరి బాలకృష్ణ అభిమానులు రమేష్, ఈరన్న, రాజు, గిడ్డయ్య, వీరేష్, ధన, దస్తగిరి, రాముడు, వినయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు

పనులు కాకుండానే ప్రారంభం

- అర్థాంతరంగా చెరువులకు నీళ్లు నింపే కార్యక్రమం
- పూర్తికాని ప్రాజెక్టుకు సిఎం శ్రీకారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పనులు పూర్తి కాకుండానే ఓ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. హంద్రీనీవా ద్వారా 77 చెరువులకు నీళ్లు నింపే కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించగా పనులు మాత్రం పూర్తి కాలేదు...

హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 77 చెరువులకు నీటిని విడుదల మంగళవారం సీఎం జగన్మోహన్ రెడ్డి లాంఛనంగా విడుదల చేశారు. కృష్ణగిరి మండలం ఆలంకొండ వద్ద రూ.253.72 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన సీఎం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాల పశ్చిమ ప్రాంత 77 చెరువులకు హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ నుండి 10363 ఎకరాల ఆయకట్టు సాగు కానుంది. అధికారిక లెక్కల ప్రకారం డోన్ నియోజకవర్గానికి సంబంధించి డోన్ మండలంలో 28 చెరువులకు గాను 2464.50 ఎకరాల ఆయకట్టు, ప్యాపిలి మండలంలో 18 చెరువులకు 1796.80 ఎకరాల ఆయకట్టు, పత్తికొండ నియోజకవర్గానికి సంబంధించి కృష్ణగిరి మండలంలో 4 చెరువులకు 1472.07 ఎకరాల ఆయకట్టు, వెల్దుర్తి మండలంలో 13 చెరువులకు 2001.8 ఎకరాల ఆయకట్టు, పత్తికొండ మండలంలో 3 చెరువులకు 212.60 ఎకరాల ఆయకట్టు, తుగ్గలి మండలంలో 13 చెరువులకు 1386.62 ఎకరాల ఆయకట్టు, మద్దికెర మండలంలో 2 చెరువులకు 699.50 ఎకరాల ఆయకట్టు సాగు కానుంది. అలాగే ఆలూరు శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి దేవనకొండ మండలంలో 3 చెరువులకు 171.5 ఎకరాల ఆయకట్టు, పాణ్యం శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి, కల్లూరు మండలం లో 2 చెరువులకు 157.60 ఎకరాల ఆయకట్టు సాగు మొత్తం 10363 ఎకరాల ఆయకట్టు సాగు కానుంది. స్వయంగా ముఖ్యమంత్రే ఈ ప్రాజెక్టును ప్రారంభించినా పనులు మాత్రం పూర్తి కాలేదు. హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి ఆలంకొండ వద్ద పంపుహౌస్ ఏరాప్రటు చేసి 5.60 కిలోమీటర్ల దూరంలో కటారుకొండపై డెలివరీ ఛాంబర్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి మూడు పైప్‌లైన్ల ద్వారా చెరువులకు నీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. అయితే ఎంపిక చేసిన చెరువుల్లో ఒక్క చెరువునూ బాగు చేయలేదు. పూడికతీత, కట్టల బలోపేతం, కరకట్టకు రాతిపరుపు, గేట్లు, అలుగుల వద్ద లైనింగ్ వంటి పనులు చేయాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. కటారుకొండ నుంచి చెరువులకు నీటిని తరలించేందుకు 110 కిలోమీటర్ల పొడవున పైప్‌లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే వీటిలో సగం కూడా పనులు పూర్తి కాలేదు. ప్యాపిలి మండలంలో 18 చెరువులకు నీరందించాల్సి ఉండగా నాలుగు చోట్ల మాత్రమే అరకొర పనులు చేశారు. పైప్‌లైన్ పనులు సాగుతున్నాయి. డోన్ మండలంలో 28 చెరువులకు నీరందించాల్సి ఉండగా 27 చోట్ల పనులు పూర్తయ్యాయి. తుగ్గలి మండలంలో 13 చెరువులకు నీరు అందించాల్సి ఉండగా ఏడు చోట్ల మాత్రమే పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. పత్తికొండ మండలంలో చక్రాళ్ల, చందోళి, పత్తికొండ చెరువులకు నీరందించాల్సి ఉంది. చక్రాళ్ల, చందోళి చెరువులకు పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. పత్తికొండలో పైప్‌లైన్ పనులు పూర్తి కాలేదు. పనులు పూర్తి కాకుండానే ప్రారంభం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులకు నీళ్లు నింపే కార్యక్రమం ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి (ఫైల్)

పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి

నాలుగేళ్ల తరువాత కూడా అసంపూర్తిగానే చెరువులకు నీటిని నింపే పనులు ఉండగా రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేవలం రాజకీయ లబ్ధి కోసం ప్రారంభం తతంగాన్ని నిర్వహించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం కాలం పూర్తయ్యే లోపే పనులు పూర్తి చేయాలి. అప్పుడే ప్రజలు నమ్ముతారు. లేకుంటే టిడిపికి పట్టిన గతే వైసిపికి పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం, ముఖ్యమంత్రి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- కె.ప్రభాకర్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

ప్రభుత్వ పాఠశాల విద్యా పరిరక్షణ ధ్యేయం

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు
- నంద్యాల జిల్లాలో యుటిఎఫ్ ప్రచార జాత

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాల విద్యా పరిరక్షణ ధ్యేయమని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఆ సంఘం గోల్డెన్ జూబ్లీని పురస్కరించుకుని చేపట్టిన యుటిఎఫ్ ప్రచార జీపు జాత కర్నూలు జిల్లా నుండి నంద్యాల జిల్లాలోకి ప్రవేశించి జిల్లాలోని పాణ్యం, నంద్యాల, ఆళ్లగడ్డ మీదుగా కడప జిల్లా మైదుకూరుకు చేరింది. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలే పరిష్కార ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఉపాధ్యాయుల హక్కులు సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు సాగించిందన్నారు. రాష్ట్రంలో ఈ సంఘం ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థ పరిరక్షణకు కృషి చేస్తుందన్నారు. సిపిఎస్ ను రద్దుచేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానాన్ని కూడా రాష్ట్రంలో అమలు చేయకుండా నిలువరించాలని పేర్కొన్నారు. అక్టోబర్ 1న విజయవాడలో జరిగే గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలలో పెద్ద ఎత్తున యుటిఎఫ్ నాయకులు కార్యకర్తలు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పివి ప్రసాద్, జె.సుధాకర్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు ఎంవి సుబ్బారెడ్డి, జిల్లా ఆఫీస్ బేరర్లు సత్య ప్రకాష్, శాంతి ప్రియ, కిషోర్, రామ్ మోహన్, రామకృష్ణుడు, రాష్ట్ర కౌన్సిలర్ లు ఐజయ్య, నాగస్వామి నాయక్, సోషియల్ మీడియా కన్వీనర్ అరవింద్, ప్రతాప్,దస్తగిరి మహ్మద్ హుస్సేన్,మధు, వేంకటేశ్వర్లు, గోపాల్, గ్రేసమ్మ, ప్రేమకాంత్, చంద్ర మోహన్, చంద్ర శేఖర్, శివ శంకర్, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జెసి

ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యత

- జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యత నిచ్చి ఫిర్యాదారులు సంతృప్తి చెందే స్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మండల స్థాయి, సచివాలయ స్థాయి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం బేతెంచెర్ల మండల కేంద్రంలోని శేషారెడ్డి హైస్కూల్ ఆవరణలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం ద్వారా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, ఇతర జిల్లాధికారులు ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా రూల్స్ ప్రకారం చేయదగిన పనులను వెంటనే చేయాలన్నారు. ప్రతిరోజు 3 నుండి 5 గంటల వరకు సచివాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు సూచించిన మూడు రిజిస్టర్ లలో సమస్యలను నమోదు చేయాలన్నారు. జిల్లా కేంద్రం నుండి వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలోలి ఖచ్చితమైన విచారణ జరిపి నివేదికలు పంపాలని జెసి ఆదేశించారు. రెవెన్యూ సర్వీసులకు సంబంధించి అనేక సమస్యలు వస్తున్నప్పటికీ పరిష్కారం కావడం లేదని... మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది కోఆర్డినేషన్ చేసుకుని నిర్దేశిత కాల పరిమితిలోగా పరిష్కరించాలన్నారు. మండల స్థాయి స్పందనకు 167 దరఖాస్తులు వచ్చాయని వీటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డోన్ ఆర్డీవో వెంకటరెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారెడ్డి, బేతంచెర్ల తాసిల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి, ఎంపీడీవో వెంకన్న, ఎంపీపీ బుగ్గన నాగభూషణ్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, ఎలక్ట్రికల్ ఏడి మధుసూదన్ రెడ్డి, మద్దిలేటి స్వామి చైర్మన్ రామచంద్రుడు,ఇతర జిల్లా స్థాయి ఉన్నతాధికారులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

భారీ వర్షం

- ఉప్పొంగిన వాగులు
- రాకపోకలకు అంతరాయం
- పంటలు మునిగి కొన్నచోట్ల రైతులకు నష్టం

రుద్రవరం : ఎర్రగుడిదిన్నె బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వాగు

ప్రజాశక్తి-విలేకరులు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. **ఆత్మకూరు** మండలంలో శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటల నుండి6 గంటల వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. మండలంలో 77.4 మిల్లీమీటర్ల వర్షం నమోదయింది. ఆత్మకూరు పట్టణంలో ఈ వర్షం వల్ల పలు కాలనీలోని డ్రైనేజీ కాలువలో ఉన్న మురికి నీరు అంతా రోడ్డుపై చేరాయి. వర్షపు నీరు, మురికి నీటి మధ్య పాదసంచారకులు తీవ్ర ఇబ్బందులకు గురి కావలసిన పరిస్థితి ఏర్పడింది. లోతట్టు కాలనీలో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోయాయి. మండలంలో ఎండిపోయే దశలో ఉన్న పంట పొలాలకు ఈ వర్షం జీవం పోసినట్లు అయిందని పలువురు రైతులు ఆనందాన్ని వ్యక్తపరిచారు. **మహానంది** మండలంలోని బోయలకుంట్ల మహానంది క్షేత్రానికి వెళ్లే రహదారిలోని పాలేరు వాగు గురువారం రాత్రి కురిసిన వర్షానికి ఉప్పొంగి నిండుకుండలా ప్రవహిస్తోంది. దీంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, ఈ దారిలో మహానందికి వెళ్లే భక్తులు ప్రయాణంలో అక్కడే ఉండిపోవాల్సి వస్తోంది. పాలేరు వాగు వరద ప్రవాహంతో గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాగు వంతెనపై నుంచి వరద ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. ఈ దారిన రాకపోకలు సాగించే భక్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. **సంజామల :** మండలంలో గురువారం రాత్రి నాలుగు గంటల పాటు ఏకధాటిగా వర్షం కొరియడంతో వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో మిరప, జొన్న తదితర పంటలు నీట మునగాయి. తీవ్రం నష్టం వాటిల్లినట్లు రైతులు శేన్ బాషా, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు తెలిపారు. పాలేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో మండలంలోని వసంతాపురం, కమలాపురి, ముదిగేడు, ఎగ్గొని సంజామల గ్రామాల్లోని రైతులు పాలేరు వెంబడి వరి పైరు వేశారు. దీనితో పాలే లేరు వాగు వెంబడి ఉన్న వరి పైరు పూర్తిగా నీట మునిగింది. **రుద్రవరం :** మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. రబీ సీజన్లో రైతులు సాగు చేసిన జొన్న పంట నీట మునిగగా.. కొన్నచోట్ల కోత కోసిన మొక్కజొన్న పంట తడిసిపోయింది. మండల పరిధిలో దాదాపు 10 సెంటీమీటర్ల దాకా వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఏడాదిగాను ఇప్పుడు కురిసిన వర్షం పెద్ద వర్షం కావడంతో వంకలు వాగుల్లో నీరు సమృద్ధిగా పారింది. ఎరుగుడిదిన్నె, పేరూరు ,చిలకలూరు, గ్రామాల సమీపంలో ఉన్న వక్కిలేరు వాగు పొంగి ప్రవహించడంతో 3 గ్రామాలకు రాక పోకలు నిలిచిపోయాయి. అవతల ఉన్న గ్రామాలకు పనుల నిమిత్తం వెళ్లి కూలీలు నీటి ప్రవాహము కారణంగా వెళ్లలేకపోయారు. ఆర్ కొత్తూరు సమీపంలో గత వారం రోజుల క్రితం సాగుచేసిన జొన్న పంట వర్షపు నీరు చేరి పంట పూర్తిగా చనిపోయి పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు సేద్యపు విత్తనాల ఖర్చులు నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన మొక్కజొన్న పంట కోత కోసి రోడ్డుపై ఆరబెట్టడంతో వర్షం కారణంగా కొన్నిచోట్ల తడిసిపోయింది. తిప్పారెడ్డి పల్లి గ్రామ సమీపంలో టి లింగం దిన్నె వైపు నుంచి ప్రవహిస్తున్న వంక కారణంగా రైతులు సాగు చేసిన వరి పంటలో నీరు చేరి పంట అంతా మునిగిపోయింది. సిరివెళ్ల రుద్రవరం గ్రామాల మధ్య ఉన్న వాగులు పొంగి ప్రవహించడంతో ఆర్టీసీ బస్సులు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో నంద్యాల వైపు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం నమోదు కావడంతో పంటలకు ఊపిరి పోసినట్లు అయింది. భూగర్భ జలాలు కూడా పెరిగేందుకు అవకాశం ఏర్పడింది. **పగిడ్యాల :** పగిడ్యాల మండలంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షం 40. 6 మిల్లీమీటర్లుగా నమోదైనట్టు తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. మండలంలో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే సాగుచేసిన పొగాకు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. జొన్న, శనగ పంటలు సాగు చేయాల్సిన రైతులు కూడా ఈ వర్షం కురవడం వలన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ జొన్న శనగ పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

సంజామల : భారీ వర్షాలతో ఉప్పొంగిన వాగు

ఆళ్లగడ్డ : గణనాధులు ఊరేగింపును ప్రారంభిస్తున్న దృశ్యం

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల కలెక్టరేట్ : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కొలువైన గణేశునికి పూజా కార్యక్రమాన్ని జాయింట్ టి. రాహూల్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి డిఆర్ఓ పుల్లయ్యలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. చిన్న చెరువు వినాయక ఘాట్ వద్ద కలెక్టరేట్ వినాయకున్ని తొలిసారిగా నిమజ్జనం ను కేంద్ర గణేష్ ఉత్సవ సమితి సభ్యులు చేశారు. అనంతరం పట్టణంలోని వినాయకులను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్పీ కే రఘువీర్‌రెడ్డి, డి.ఎస్.పి మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబులిసా, మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రైతు నగరంలో ని భగత్ సింగ్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ లడ్డు లక్ష రూపాయలకు వేలంపాటలో ఎమ్మెస్ నగర్ కు చెందిన ఎలక్ట్రికల్ హుస్సేన్ దక్కించుకున్నారు. **ఆళ్లగడ్డ:** పట్టణంలో గణేష్ నిమజ్జనం వేడుకలు ప్రశాంత వాతావరణంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఆళ్లగడ్డ పట్టణంలోనీ అన్ని వీధులలో కొలువుదిరిన గణనాధులు వరుస క్రమంలో నాలుగు రోడ్లు కూడలి వరకు చేరుకొని పాత బస్టాండ్, మున్సిపాలిటీ కార్యాలయం మీదుగ పడకండ్ల సమీపంలో ఉన్న వకులానది చేరుకొని అక్కడ నిమజ్జనం చేశారు. డీఎస్పీ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో పట్టణ సిఐ రమేష్ బాబు నేతృత్వంలో రూరల్ సీఐ హనుమంతు నాయక్, ఎస్సైలు వెంకట్రెడ్డి, నరసింహులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ వెంకట్రామయ్య, కమిషనర్ రమేష్ బాబు గణేష్ కేంద్ర కమిటీ నాయకులతో కలిసి వకులానది వద్ద నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు త్రినేత్ర మోహన్ రెడ్డి,టిఎంసి వేణుగోపాల్, ఎలక్ట్రికల్ ఏ డి ఈ రవికాంత్ చౌదరి, ఏఈ కంబగిరి, మున్సిపాలిటీ ఏఈ సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **పాణ్యం:** మండలంలోని అన్ని గ్రామాలలో వినాయక నిమజ్జనం నిర్వహించారు. 30కి పైగా విగ్రహాలు గంగమ్మ చెంతకు చేరాయి. ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. **బనగానపల్లె :** పట్టణంలో వినాయక చవితి నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని పెండేకంటి నగర్, మూడవ సచివాలయం సమీపంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం, కరెంట్ ఆఫీస్, జిఎం టాకీస్, కొండపేటలోని యాదవ సంఘం, ఆర్యవైశ్య సంఘం, బలిజ సంఘం, నాయి బ్రాహ్మణ సంఘం లతో పాటు ఇతర ప్రాంతాలలో **మిగతా 6వ పేజీలో...**

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - ఆత్మకూరు

రాష్ట్రంలో తీవ్ర వర్షాభావంతో కరువు చాయలు నెలకొన్నప్పటికీ ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ప్రభు త్వం తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, మాజీ తహసిల్దారు పి రామకృష్ణుడు, వాకిలిటీ పేట కౌలు రైతు సంఘం అధ్యక్షులు అశ్రఫ్ అలీ, నంద్యాల టర్నింగ్ కౌలు రైతు సంఘం నాయకులు రహం, మండల కార్యదర్శి వీరన్నలు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్ నందు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు పి మాబాష అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షభావ పరిస్థితి నెలకొన్న అన్ని ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయమైన పంటలకు అవసరమైన విత్తనాలను 9 శాతం సబ్సిడీతో అందించాలని పంటలు వేసి నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రైతులు కౌలు రైతులకు అన్ని రకాల రుణమాఫీ చేయాలని వ్యవసాయ కూలీలు పేద రైతులకు జీవనోపాధి కోసం ఉపాధి హామీ పథకం 100 రోజులు అదనంగా పనులు కల్పించి కరువు సహాయం కింద ప్రతి వ్యవసాయ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించాలని కరువు సహాయక చర్యలు చేపటడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలను చైతన్యపరిచి రైతాంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు సచివాలయాల్లో రైతాంగ సమస్యలపై వ్యక్తిగత అర్జీలు ఇవ్వాలని 25వ తేదీ మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు చేపట్టాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పాల శివుడు, జి నాగేశ్వరావు, కృష్ణమోహన్, అంబయ్య, ఆదినారాయణ, రఫిక్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్

ఓటమి భయంతోనే అక్రమ కేసులు : టిడిపి

దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - విలేకరులు

పాణ్యం : సిఎం జగన్ మోహన్ రెడ్డి ఓటమి భయంతోనే మాజీ సిఎం చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు పెడుతున్నారని నంద్యాల జిల్లా తెలుగదేశం పార్టీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టిడిపి పాణ్యం నియోజకవర్గ ఇంఛార్జి గౌరు చరిత, నాయకులు గౌరు వెంకట రెడ్డిలు అన్నారు. పాణ్యంలోని పార్టీ కార్యాలయంలో రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబుని అక్రమ కేసుల్లో ఇరికించి వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్న వైసిపి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని, బెయిల్ మీద బయట తిరుగుతున్న నాయ కుడు అతనిలాగే అందరినీ జైలుకు పంపెలా చూస్తున్నాడని అన్నారు. పార్టీ కార్యక్రమాలను అధిష్టాన ఆదేశాల ప్రకారం ప్రజల్లోకి తీసుకొని వెళ్ళాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జయ రామిరెడ్డి,లాయర్ బాబు, రమణ మూర్తి, ఎంపిటిసిలు రంగ రమేష్,కౌలూర్ భాస్కర్ రెడ్డి,ఈశ్వర్ రెడ్డి,శివ శంకర్ రెడ్డి,రామ చంద్రుడు,సావిత్రి వరలక్ష్మి,దుబాయ్ శీను తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్:** టీడీపీ అధినేత చంద్రబాబు యాత్రలకు వస్తున్న ప్రజాదరణను చూసి, ఎన్నికల్లో తనకు ఓటమి తప్పదన్న భయంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తప్పుడు కేసు పెట్టి చంద్రబాబును జైలుకు పంపాడని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. శ్రీశైలం నియోజకవర్గ కేంద్రంలో ఆత్మకూరులో శుక్రవారం 10వ రోజు చేపట్టన రిలేనిరహారదీక్షల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగుతోందన్నారు. జగన్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా ఒరిగేది ఏమీలేదని అంతిమంగా న్యాయం గెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బన్నురు రామలింగ రెడ్డి, సీనియర్ నాయకులు వెల్పనూరు ధర్మా రెడ్డి, ముసాని మహేశ్వర రెడ్డి, అమలాపురం గోకారి, రవీంద్రా, రమేష్ గౌడ్, రామకష్ణ, నాగేశ్వర నాయక్, సుంకన్న, గోపి, మద్దిలేటి, మూర్తుజా, శివా రెడ్డి, దేవేంద్ర గౌడ్, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు వేణు గోపాల్, మండల అధ్యక్షుడు శివ ప్రసాద్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి నాగుర్ ఖాన్, యూనిట్ ఇంఛార్జి రామూర్తి, ఎస్తేరు, సుబ్బా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం సమీపంలో టిడిపి బీసీ సెల్ నాయకులు నిరాహార దీక్షలు నిర్వహించారు. 'బాబుతో నేను, బాబు గారికి తోడుగా.. ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం' అంటూ టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న ఆధ్వర్యంలో టిడిపి బీసీ సెల్ నాయకులు 10 వ రోజు సామూహిక నిరాహార దీక్షలు నిర్వహించారు. అనంతరం బాబు గారితో నేను సైతం అంటూ బ్యానర్ పై సంతకాలు చేశారు. దీక్షలో పాల్గొన్న బిసి సెల్ నాయకులకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు టీచర్ పక్కిరా రెడ్డి, టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు టంగుటూరి శీనయ్య నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో నందివర్గం మాజీ సర్పంచ్ ఉమామహేశ్వరరావు, టిడిపి బీసీ సెల్ నాయకులు తపాల పెద్ద దస్తగిరి, పసుపల బాల నాయుడు, కటకెవానికుంట బాలరాజు యాదవ్, క్రిష్టగిరి రంగస్వామి యాదవ్, మంగంపేట రమణ యాదవ్, చిన్న రాజుపాలెం నరసింహులు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, టిడిపి మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, మండల కార్యదర్శి ఖాదర్ భాషా, నాయకులు టిప్ టాప్ కలాం అల్తాఫ్ హుస్సేన్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

15 మందికి అతిసార

ప్రజాశక్తి - పగిడ్యాల

మండల కేంద్రం పగిడ్యాల శుక్రవారం నాడు మందికి అతిసార వ్యాధి సోకింది. పగిడ్యాల గ్రామంలోని తెలుగు వీధిలో 15 మందికి వాంతులు విరేచనాలు కావడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నికి వెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి ముగ్గురిని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు, 12 మందిని కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు 108లో తరలించారు. ఈనెల 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దాదాపు 110 మంది అతిసార సోకడం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్య సిబ్బంది చికిత్స చేయడంతో అతిసార వ్యాధి అదుపులోకి వచ్చింది. మరల శుక్రవారం పగిడ్యాల గ్రామంలో 15 మందికి వాంతులు విరోచనాలు కావడంతో నందికొట్కూరు ముగ్గురిని, కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు 12 మందిని తరలించారు. పైపు లైన్ లీకై నీరు కలుషితమైందని ఆ నీరు తాగడం వలన వాంతులు విదేశాలు అవుతున్నాయని స్థానిక గ్రామస్తులు పేర్కొంటున్నారు. పైపులు మరమ్మతులు చేసి కలుషితం నీరు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెక్కు పంపిణీ చేసిన జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

పేదలకు వరం వైఎస్ఆర్ బీమా

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

పేద ప్రజలకు వైఎస్ఆర్ బీమా ఎంతో ఉపయోగకరమని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల లోనే ఎర్రబోతుల కార్యాలయం నందు జిల్లా పరిషత్ చైర్మన్ చేతుల మీదుగా ఐదు లక్షల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఉమ్మాయి పల్లె గ్రామానికి చెందిన చందు నాయక్ జూలై నెలలో 16వ తేదీన ఇండ్లు కూలి ఇంట్లో ఉన్న చందు నాయకపై పడి చందు నాయక అక్కడికక్కడే మృతి చెందడంతో ఆయన భార్య లక్ష్మీదేవికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అంబటి గురువు రెడ్డి గురివిరెడ్డి సచివాలయ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పేరం సత్యనారాయణరెడ్డి, వైసిపి నాయకులు తిమ్మారెడ్డి, గోపాల్ రెడ్డి, జయ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లారీ కింద పడి మృతి చెందిన గొర్రెలు

లారీ ఢీకొని 16 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని యాగంటిపల్లె పెట్రోల్ బంక్ సమీపంలో మహాశక్తి సిమెంట్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం అతివేగం వల్ల లారీని నడుపుతూ గొర్రెలపై ఎక్కించడంతో 16 గొర్రెలు మృతి చెందడమే కాక కారును ఢీకొనడంతో కారు నుజ్జు అయింది. శుక్రవారం తెల్లవారుజామున బనగానపల్లె నుండి గుత్తి వైపు వెళ్తున్న మహాశక్తి సిమెంట్ లారీ యాగంటి పల్లె సమీపంలోనే పెట్రోల్ బంకు దగ్గర జోలాపురం నుండి తమ్మడపల్లె గ్రామానికి చెందిన మడ్డి రామ గోపాల్ గొర్రెలను తోలుకొని వస్తుండగా లారీ అతి వేగంగా వచ్చి గొర్రెల మీద వెళ్లడంతో 16 గొర్రెల మృతి చెందగా మరికొన్ని గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. గొర్రెలను గొర్రెలపై ఎక్కి లారీ ఆగి ఉన్న కారును ఢీకొనడంతో కారు నుజ్జు కాగా కారులో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. తముడపల్లె గ్రామానికి చెందిన గొర్రెల కాపరి మడ్డి రామగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామిరెడ్డి తెలిపారు.

నాగిరెడ్డిని సన్మానిస్తున్న అధికారులు వాలంటీరీలు

సిపిఎస్ కంటే ప్రమాదకరం జిపిఎస్

- నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన

ప్రజాశక్తి - బనగానపల్లె

సిపిఎస్ విధానం కంటే జిపిఎస్ విధానం అత్యంత ప్రమాదకరమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు, ఫ్యాప్టో చైర్మన్ బి. మాధవ స్వామి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో జిపిఎస్‌ను రద్దు చేయాలని ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాధవ స్వామి మాట్లాడుతూ జిపిఎస్ విధానాన్ని విరమించుకొని సిపిఎస్ విధానానికి రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానంలో ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ తో పాటు ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ ఉండేదని ఇప్పుడు ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ లేకుండా ఉపాధ్యాయుల, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ మాత్రమే ఉంటుందని తెలిపారు. జిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ ఏపీటీఎఫ్, ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని తాలూకా కేంద్రాల్లో 23వ తేదీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 25వ తేదీ చలో కలెక్టరేట్ కార్యక్రమలను ఉద్యోగులు ఉపాధ్యాయులు విజయవంతం కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం పుల్లయ్య, ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు పోలియో నాయక్, పరమేశ్వరుడు ,మహబూబ్ బాషా, లక్ష్మణ్ నాయక్,లక్ష్మీకాంత్ నాయక్, శేష రామ్ నాయక్, ఉపేంద్ర, సుధాకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **డోన్ :** డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఉపాధ్యాయులు మధ్యాహ్నం విరామం సమయంలో నల్లబ్యాడ్జీలతో సిపిఎస్ రద్దు చేయాలని శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డోన్ ఫ్యాప్టో చైర్మన్ వెంకట రమణ, వైస్ చైర్మన్ లక్ష్మయ్య, కన్వీనర్ ఎం.వెంకట సుబ్బారెడ్డి, కో కన్వీనర్ ప్రసాద్ రావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శివ ప్రసాద్, సుబ్బారెడ్డి, లక్ష్మీ కాంత రెడ్డి,అనంత శ్రీనివాసులు, అల్లీపీరా, భూకాంతరెడ్డి, శ్రీనివాసులు, రఘు నాథ్, ఎస్తేరమ్మ, మధుసూదన్ రెడ్డి,రాధ,జయ సుబ్బారాయుడు, శ్రీనివాసులు, మద్దిలేటి, ఆదినారాయణ,సుభాన్, విజయకుమార్, సుబ్బారాయుడు, సురేష్, లీలావతమ్మ,రమేష్, భారతి, భాను ప్రకాష్ రెడ్డి, హుస్సేన్ భాను, ముని రాజు, తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** జిపిఎస్‌ను ఎపి క్యాబినెట్ ఆమోదించడాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని యస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజు, ప్యాపిలి మండల ఫ్యాప్టో నాయకులు చంద్రమౌళి, చిన్నపరెడ్డి పేర్కొన్నారు. ఆయా సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. విరామ సమయంలో జిపిఎస్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో హాజి మస్తాన్ వలి, శ్రీనివాసులు, మమత, సరోజమ్మా ,చాముండేశ్వరి, క్రిష్ణ వేనమ్మ, లితెమ్మ, గోపాల్,మద్దిలేటి, కంబగిరి,దివాకర్, శ్రీనివాసులు, రాగవేణి, పద్మావతమ్మ,లక్ష్మీదేవి,జయలక్ష్మి, సుజాత, రమాదేవి, శివ, గోపాలకృష్ణ, మల్లేష్, రాజశేఖర్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన

ప్యాపిలి : నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రచారం చేస్తున్న అబ్దుల్ గఫార్

శాంతి కోసం ఆటో యాత్ర

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రపంచ శాంతి కోసం మండలంలోని మర్రిపల్లికి చెందిన అబ్దుల్ గఫార్ ఆటో యాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణానికి చేరుకున్న ఆటో యాత్ర ద్వారా అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ చెడు మార్గాలను ఎన్నుకొని చెడిపోయే వారికి శిక్ష తప్పదని, శాంతి మార్గంలో జీవించాలన్నారు. ముక్కలైన మానవ సమాజ సమైక్యతకు ఐకమత్యమే మహా బలమని ఆయన కరపత్రాలు అందజేశారు.

సమయ పాలన పాటించాలి

ప్రజాశక్తి - చాగలమర్రి

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీ డీఓ మహబూబ్ దౌలా ఆదేశించారు. శుక్రవారం మండలంలోని శెట్టివీడు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ రికార్డు లను పరిశీలించారు.సచివాలయానికి వచ్చే వారికి అందుబాటులో ఉండానలని,వచ్చిన వారితో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని ఎంపీడీఓ సూచించారు. పిఆర్ ఏఈ కొండారెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

సూచనలిస్తున్న ఎంపిడీఓ

బేతంచెర్లను కరువు మండలంగా ప్రకటించాలి : వ్యకాసం

జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆర్ ఈశ్వరయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి సుబ్బారాయుడు తదితరులు

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, నగర పంచాయతీలో ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని, రైతులను, కౌలు రైతులను,వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.సుబ్బరాయుడు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.ఈశ్వరయ్యలు కోరారు. శుక్రవారం స్థానిక పట్టణ కేంద్రంలోని శేషారెడ్డి హై స్కూల్ నందు జగనన్నకు చెబుదాం(స్పందన) అనే కార్యక్రమానికి వచ్చినటువంటి నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి రైతుసంఘం,కౌలురైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. అనంతరం వి.సుబ్బరాయుడు, ఆర్.ఈశ్వరయ్య,లు జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడుతూ బేతంచర్ల మండలంలో ఖరీఫ్ సీజన్ లో సకాలంలో వర్షాలు కురవక రైతులు వేసిన పంటలు ఎండిపోయి రైతులు వేసిన పూలు,కొర్ర,తదితర పంటలను, ఎత్తపాయడం జరిగిందన్నారు. రైతులు నష్టపోయారని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులకు పంటనష్టపరిహారం చెల్లించాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకం ద్వారా జాబు కార్డు ఉన్న ప్రతికుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించి, పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు వేతనం రూ.600 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మండలంలోని చెరువులను నీటితో నింపి రైతులకుసాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు. అలాగే డోన్ నేషనల్ హైవే నుండి బేతంచెర్ల మీదుగా సోమయాజులపల్లె నేషనల్ హైవే వరకు హైవే రోడ్డుకు పోయినటువంటి రైతుల పొలాలకు నష్టపరిహారం చెల్లించి హైవే రోడ్డు పనులు ప్రారంభించాలని లేకపోతే రైతులను,కౌలు రైతులను, వ్యవసాయ కార్మికులను,పెద్ద ఎత్తున సమీకరించి హైవే రోడ్డు పనులు జరగకుండా అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. బేతంచర్ల గ్రామ పంచాయతీ, బుగ్గానపల్లి గ్రామపంచాయతీల వ్యవసాయ కార్మికులకు పనులు చూపించి ఆదుకోవాలని వారు కోరారు. భూయజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు కౌలు కార్డులు, బ్యాంకు రుణాలు,సబ్సిడీలు, అందించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ వినతి పత్రం కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, పి.రామ్మోహన్, పద్మావతమ్మ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి ఎన్.హైమావతి, కె.సుభద్రమ్మ,డి.దస్తగిరమ్మ,కె. మద్దమ్మ,ఎస్.రేష్మ, ఎస్. రహంతుల్లా,ఎన్.వి.కష్ణన్న , మబూ,పకీరప్ప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండలాధ్యక్షుడు నాగిరెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - పగిడ్యాల

వైసిపి అధిష్టానం నూతనంగా మండల వైసిపి అధ్యక్షులను నియమించింది. నూతనంగా పగిడ్యాల మండల అధ్యక్షునిగా మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డిని నియమిస్తూ వైసిపి అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సర్పంచి పెరుమాళ్ళ శేషన్న,వాలంటీర్లు, వైద్య సిబ్బంది పుల్యాల నాగిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుల్యాల నాగిరెడ్డి మాట్లాడారు. అధిష్టానం గుర్తించి మండల వైసీపీ అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మండలస్థాయి అధికారులతోని కిందిస్థాయి సిబ్బందితో కలిసిపోయి మండల ప్రజల సేవ చేయడం మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సహకారంతో నన్ను నమ్మి వైసీపీ అధిష్టానం మండల అధ్యక్ష నన్ను నియమించినందుకు వైసిపి పార్టీ అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

చెరువుకు పూజలు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

చెరువులో పూజలు చేస్తున్న ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి శుక్రవారం పూజల చేశారు. కొలిమిగుండ్ల మండల సమీపంలోని నాయన పల్లె గ్రామం సమీపంలో ఉన్న సద్దన్న వెంకన్న చెరువులోకి గురువారం రాత్రి కురిసిన వర్షం కురవడంతో సద్దల వెంకన్న చెరువుకు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరడంతో చెరువు నుండి అలుగు పై ప్రవహిస్తుంది. నాయన పల్లె పెట్టి కోట కొలిమిగుండ్ల రైతులకు బోర్లలో నీళ్లు చేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలుగుపై నీరు ప్రవహిస్తున్న విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ అంబటి గురువు రెడ్డి, వైసీపీ జిల్లా నాయకులు పేరం సత్యనారాయణ రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ మొలక రాజారెడ్డి, పెట్టికోట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

(5వ పేజీ తరువాయి...)

మండపాల్లో కొలువుదీరిన వినాయకుని విగ్రహాలను పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి కైపచెరువులో నిమజ్జనం నిర్వహి ంచారు. వినాయక మహోత్సవ కమిటీ కార్య నిర్వాహకుడు లాయర్ మాధవరెడ్డి, పెండే కంటి నగర్ ఉత్సవ కమిటీ సభ్యులు కాటసాని తిరుపాల్ రెడ్డి, దొనపాటి యాగంటిరెడ్డి, తోట బుచ్చిరెడ్డి, లాయర్ నాగేశ్వర రెడ్డి వంగల పరమేశ్వర రెడ్డి, నంది పైపులు రామచంద్రా రెడ్డి ఆచారి, ఒంటెద్దు చిన్నపురెడ్డి, లాయర్ టిఆర్ జగన్నాథరెడ్డి, కుమ్మరి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణ ంలో వినాయకుల విగ్రహా లను పూర్వవీధుల గుండా ఊరేగింపు నిర్వహి ంచారు. నిమజ్జన ప్రాంతంలో తహసిల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వ ర్యంలో రెవిన్యూ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. వినాయక నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీ య సంఘటనలు జరగ కుండా సిఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో బనగాన పల్లె నందివర్గం ఎస్ఐలు రామిరెడ్డి, రామాం జనేయరెడ్డిలు బందోబస్తు ఏర్పాటు చేశారు. **సంజామల:** మండలంలో సంజామల, నొసం, పేరు సోమల గ్రామా లలో గణేష్ నిమజ్జన నిర్వహించారు. వీధుల గుండా గణేష్ విగ్రహాలను ఊరేగింపు చేసి పాలేరు వాగులో నిమజ్జనం చేశారు. **నందికొట్కూరు టౌన్ :** పట్టణంలోనీ అన్ని వీధులలో కొలువుదిరిన వినాయకులను పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు.

వినాయకులను ఊరేగింపుగా తీసుకెళుతున్న దశ్య

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS BY ARBITRATER : KURNOOL
DISPUTE NO.51/2023

Between:
M/S Sri Balaji Nandi Chits (P) Ltd,
Nandyal. ...Disputant

-Versus-

1) MD.Abdul Haq
2) S.B.Khader Basha. ...Opponents

OPPONENTS 1 AND 2 NOTICES

1) MD.Abdul Haq S/o MD.Rabbani, Urdu Munshi Gr-II, Siddiqui Upper primary School, Jillella (V), Gospadu (M), Nandyal (Dt).
2) S.B.Khader Basha S/o S.Hussain, H.No.2-68, Mullan Peta, Nandyal.

పై దావా నందు Disputant Company వారు వారికి రావలసిన బాకీ మొత్తం 92,789/– అసలు మరియు ఖర్చులు, వడ్డీ రాబట్టుకొనుటకు గాను మీపైన దావా దాఖలు చేసినారు. ఇందు 1 మరియు 2 Opponents అయిన మీరు 05–10–2023వ తేదిన ఉదయం 11:00 గంటలకు పై కోర్టు వద్ద హాజరు కాగలరు. మీరుగాని మీ తరపున వకీలు గాని హాజరై మీకు ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో తెలుపగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరములు లేదని మీ పరోక్షమున తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది: 05-10-2023

By Order of the Deputy Registarar of Chits
By Arbitrater, Kurnool.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS BY ARBITRATER : KURNOOL
DISPUTE NO.50/2023

Between:
M/S Sri Balaji Nandi Chits (P) Ltd,
Nandyal. ...Disputant

-Versus-

1) D.Husseni
2) Shaik Malik Basha
3) K.Nagaraju. ...Opponents

OPPONENTS 1 TO 3 NOTICES

1) D.Husseni S/o D. Chinna Husseni, H.No.3-131, Pedda Kottala (V), Nandyal (Dt).
2) Shaik Malik Basha S/o S.Abdullah, Trach MNTR-1, Engineering Department, South Central Railway, Nandyal.
3) K.Nagaraju S/o K.Pedda Peddanna, Forest Sction Officer, Velugodu Forest Check Post, Velugodu (M), Nandyal.

పై దావా నందు Disputant Company వారు వారికి రావలసిన బాకీ మొత్తం 3,27,402/– అసలు మరియు ఖర్చులు, వడ్డీ రాబట్టుకొనుటకు గాను మీపైన దావా దాఖలు చేసినారు. ఇందు 1 నుంచి 3 Opponents అయిన మీరు 05–10–2023వ తేదిన ఉదయం 11:00 గంటలకు పై కోర్టు వద్ద హాజరు కాగలరు. మీరుగాని మీ తరపున వకీలు గాని హాజరై మీకు ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో తెలుపగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరములు లేదని మీ పరోక్షమున తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది: 05-10-2023

By Order of the Deputy Registarar of Chits
By Arbitrater, Kurnool.

క్రీడా ఆణిముత్యాలను ప్రోత్సహించండి : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచర్ల

మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, చిత్రంలో చైర్మన్ చలం రెడ్డి, ఆర్‌డిఒ తదితరులు

గ్రామీణ స్థాయిలలో ఉన్నటువంటి క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడా ప్రతిభను వెలికి తీసే విధంగా వీటిలో ప్రోత్సహి ంచాలని ఆర్డీవో వెంకటరెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణ్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలమరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు బేతంచెర్ల పట్టణంలోని శేషారెడ్డి హైస్కూల్ ఆవరణమునందు డోను నియోజకవర్గం స్థాయి డోను, ప్యాపిలి, బేతంచర్ల,మూడు మండలాల్లో అండర్ 14, 17 విభాగాలలో బాలబాలికలకు ఆటల పోటీలను నిర్వహించారు. ప్రారంభ సమావేశంలో ఆర్డీఓ, ఎంపీపీ, చైర్మన్ మాట్లాడారు. క్రీడల్లో ఓటమిని విజయాన్ని సమభాగాలుగా పాటించాలన్నారు. ముఖ్యఅతిథిగా నంద్యాల జిల్లా స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీనాథ్ విచ్చేసి విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను జిల్లా స్థాయిలో ప్రోత్సహించి ఉత్తమమైన ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయిలో కూడా తీసుకెళ్లడానికి తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డోను ప్యాపిలి బేతంచెర్ల పి ఈ టి, ఫిజికల్ డైరెక్టర్లు, శేషారెడ్డి హై స్కూల్ హెడ్మాస్టర్ అబ్రహం, జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ, రంగనాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షుడి పుట్టినరోజు

ప్రజాశక్తి - బనగానపల్లె

టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్యకు కేకును తినిపిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టంగుటూరు శీనయ్య పుట్టినరోజు సందర్భంగా పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ పక్కిర రెడ్డి టిడిపి నాయకులు కాట్ రెడ్డి మల్లికార్జున రెడ్డి, టిడిపి సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, టిడిపి మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు ఇల్లూరు కొత్తపేట సొసైటీ మాజీ అధ్యక్షులు మల్లారెడ్డి, రాయలసీమ సలాం, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు రేగటి నాగిరెడ్డి, నాయకులు టిప్ టాప్ కలాం, నుసి విష్ణువర్ధన్ రెడ్డి, సుధాకర్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామారావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఉపాధ్యాయుడు రామారావును సన్మానిస్తున్న అధ్యాపక బృందం

సౌత్ ఇండియా ఐకాన్ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె.రామారావును శుక్రవారం ప్రగతి హైస్కూల్ నందు ప్రగతి హైస్కూల్ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించిం ది. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ శకుంతల మాట్లాడుతూ ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శిగా ఉంటాడని దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని అన్నారు. బోధన పట్ల అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులుగా ఉంటారని, బాల బాలికల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. రామారావు పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దడంలో విశేషంగా కృషి చేశారన్నారు. ఈ అవార్డు రావడం పాఠశాలకు గర్వమని అన్నారు. అనంతరం రామారావుని విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలతో శాలు వాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవయ్య, శ్రీధర్, మురళి, రామసుబ్బయ్య, షహనా, శ్రీలక్ష్మి శ్యామలమ్మ, హరిత, హారిక, మనీ, అర్చన, హేమలత, రాజేశ్వరి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

కొత్తపల్లి : విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

సత్తా చాటిన దుద్యాల విద్యార్థులు..

కొత్తపల్లి : నందికొట్కూరు తాలుకా స్థాయిలో సత్తా చాటిన దుద్యాల పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యా యులు మంగన్న ఆకాంక్షించారు. శుక్రవారం కొత్తపల్లి మండల ంలోని దుద్యాల గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గెలుపొందిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యులు మాట్లాడుతూ ఈనెల 20, 21 తేదీలలో నందికొట్కూరులో జరిగిన తాలుకా స్థాయి పోటీల్లో అండర్ 14 బాలురు ఖోఖోలో మొదటి స్థానంలో గెలుపొందడం హర్షనీయం అన్నారు. పాఠశాల నుంచి దాదాపు 9 క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. అథ్లెటిక్స్‌లోనూ క్రీడాకారులు రాణించి జిల్లా స్థాయికి ఎంపిక కావడం జరిగిందన్నారు. దాదాపుగా 20 మంది క్రీడాకారులను జిల్లాకు ఎంపిక కావడం జరిగిందన్నారు. క్రీడాకారులు జిల్లా స్థాయిలోనూ రాణించి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ఉపాధ్యాయ బృందం సీనియర్ క్రీడాకా రులు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు కృష్ణ మోహన్, శంకర్, వెంకటేశ్వర్లు, వసుంధర ఉన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొలిమిగుండ్ల : ఏ.పి. మోడల్ స్కూల్ విద్యార్థులు వివిధ క్రీడల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ పి.చంద్రసేనా రెడ్డి తెలిపారు. ప్రిన్సిపల్ పి.చంద్రసేనారెడ్డి మాట్లాడుతూ మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో వాలీబాల్ ఆటలో ఇంటర్ విద్యార్థులు రవి రాజు, హ్యాండ్ బాల్ ఆటలో దస్తగిరి, ఉదయ్, జిల్లాస్థాయిలో శ్రీకాంత్,కె.వి కార్తీక్, అండర్ – 17 త్రోబాల్‌లో జీవిత అనే విద్యార్థిని,కబడ్డీ ఆటలో వై.నరసింహ అండర్–14కు వాలీబాల్ ఆటలో శ్రీశాంత్ రెడ్డి యం.శంకర్ అబ్దుల్లా ఎంపికైనట్లు పేర్కొన్నారు. పిఇటి గంగాదేవిని, ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకబృందం తదితరులు అభినందించారు.

జిల్లా స్థాయి త్రోబాల్ పోటీలకు వేంపెంట విద్యార్థులు

పాములపాడు: నందికొట్కూరు నియోజకవర్గంలో జిల్లా స్కూల్ గేమ్ సెక్రెటరీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో పాములపాడు మండలం వేంపెంట జడ్పీహెచ్ హైస్కూల్ విద్యార్థులు త్రోబాల్ క్రీడలో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌జిఎఫ్ నియోజకవర్గ ఎంపిక పోటీల్లో వేంపెంట జిల్లా పరిషత్ స్కూల్ బాలురు, బాలికలు త్రోబాల్లో డబల్ క్రౌన్ క్రైస్తవం చేసు కున్నారని తెలిపారు. విద్యార్థులను అభినందించినట్లు ఆయన తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులతో ఉపాధ్యాయులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరమణ

ఆరోగ్యంపై ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

ఆరోగ్యంపై ప్రతి ఇంటింటా తిరిగి ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలని ఎంపీడీవో వెంకటరమణ, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎఫ్ఎంఒ బాలయ్య అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తిరిగి ఆరోగ్య సూచనలు ఇస్తూ ఎవరైనా అనారో గ్యానికి గురయింటే అడ్మిట్ చేయించి చికిత్స అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆరోగ్య సిబ్బందికి, వాలంటీర్లకు వారు సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల డెంగు , మలేరియా, చికెన్ గునియా, అతి సారా వ్యాధుల గురించి ప్రతి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భారతి, సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న పంచాయతీ కార్యదర్శులు ,ఆరోగ్య సిబ్బంది, వాలంటరీలు పాల్గొన్నారు.

అహోబిలంలో తొలి పీఠాధిపతి తిరునక్షత్ర వేడుకలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో శుక్రవారం మొదటి పీఠాధిపతి ఆదివన్ శటగోప యతీంద్ర మహాదేశికన్ స్వామి తిరునక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానార్చకులు క్రీడాంబి వేణుగోపాలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ ప్రహ్లాదవరద స్వామికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, అమృతవల్లి అమ్మవారికి నవ కలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు.

అహోబిలేసుని దర్శించుకున్న మాజీ ఎంపీ గంగుల...

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని నంద్యాల మాజీ పార్లమెంట్ సభ్యులు గంగుల ప్రతాపరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన రాక సందర్భంగా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఉన్న ప్రహ్లాద వరద స్వామి, అమతవల్లి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయంలో జరుగు తున్న అహోబిలం మొదటి పీఠాధిపతి తిరు నక్షత్ర వేడుకల్లో పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎంపీ గంగుల

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి - ఆత్మకూర్

రక్తదానం చేసి ప్రాణదాతలుగా కావాలని సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రాయుడు అన్నారు. శుక్రవారం నాడు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు రెడ్ రిబ్బన్ క్లబ్ ప్రొగ్రాంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు 18 నుండి 65 సంవత్సరాల లోపు వారు రక్తదానం చేయుచునని, మహిళల ప్రసవ సమయంలో,సర్జరీ సమయాల్లో అధికంగా రక్తం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ వెంకట నరసయ్య మాట్లాడుతూ విద్యార్థులు సేవభావం కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ రవి కుమార్, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ ప్రసాద్,సీనియర్ అధ్యాపకులు పద్మావతి, విద్య సాగ ర్, చంద్రశేఖర్ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనా కల్పిస్తున్న వైద్యధికారి రాయుడు

మహారాజశ్రీ ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 124/2018 in O.S 38/2016

B.నసురుల్లా ఖాన్. ...అర్జిదారు/ డిక్రీహోల్డర్

V/S

పింజరి మౌలాలి అలియాస్ మౌలాలి.
...రేస్పాండేంట్/జె.డి.అర్

వేలం ప్రకటన

పైన కనపరచిన డిక్రీ హోల్డర్ కు జె. డి. ఆర్ నుండి రావలసిన ఇ.పి సొమ్మును రాబట్టు కొనుటకు ఈ క్రింద కనపరచిన ఇ.పి షెడ్యూల్ దాఖలు ఆస్తిని
19–10–2023 ఉదయం 10–30 ని. హైకోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును. కావున కొనవలసినవారు ఎవరైనా బహిరంగ వేలంలో పాల్గొనవచ్చు.

షెడ్యులు : – నంద్యాల జిల్లా, నంద్యాల డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ బండి ఆత్మకూరు సబ్–రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, వెలుగోడు రెవెన్యు మండలము, వెలుగోడు రెవెన్యు గ్రామ పరిదిలో గల జే.డి.ఆర్ యొక్క ఆస్తి వివరాలు.
సర్వే నెంబరు:–116
విస్తీర్ణము : 0.02.250 (రెండు పావు) సెంట్స్
చేని పేరు: కోట వెంకట చేను.
డి.హెచ్.ఆర్ విలువ – 1,50,000
అమీన విలువ : 30 లక్షలు
చెక్కుబంది.:–
తూర్పున :– అమరావతి మోహన కుమార్ మంగళము మరియు బ్రదర్స్ ఇప్పుడు వుశని పీరా ఇండ్లు.
పడమర :– మినిల్లా అలియాస్ మల్లన్న ఇప్పుడు కాలి స్థలం ఇస్మాయిల్
ఉత్తరం: పుల్లయ్య ఆచారి భూమి ఇప్పుడు కాలి స్థలం జి.చాంద్ బాష
దక్షిణం: 15 అడుగుల రస్తా .
Note: పై ఆస్థి పై B. Nasurullakhan వారికి ఉండబడిన అయికము మొత్తం లోబడి వేలం వేయబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : - 19-10-2023

కే.లక్ష్మి నారాయణ, బి కాం., బి ఎల్
అర్జీదారు న్యాయవాది
ఆత్మకూరు, నంద్యాల జిల్లా.
సెల్ నెం : 9440226537